


# మనం
# ఖమ్మం
# భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com | గురువారం | 07 | మే | 2026 | పేజీలు : 20


# పేదల ముంగిటకే ప్రజాపాలన

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- మే నెలాఖరుకు రెండో విడత మంజూరు
- 35 రోజుల్లోనే సాదా బైనామా సమస్యల పరిష్కారం
- రైతులకు రుణమాఫీ, మద్దతు ధరతో కొండంత అండ




వివరాలు 4లో..


**గువ్వలగూడెం ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

## సుడా ఛైర్మన్ గా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

### జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా మహమ్మద్ ఖాదర్ అలీ





**ఖమ్మం, మే 6(మనం బ్యూరో):** ఎప్పటినుండో ఖాళీగా ఉన్న సుడా ఛైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ గా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా మహమ్మద్ ఖాదర్ అలీ (ఖాదర్ బాబా) నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ గా ఉన్న దుర్గాప్రసాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా పని చేశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాప్రసాద్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మహమ్మద్ ఖాదర్ ఆలీ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకులు. మంత్రి తుమ్మల విజయంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఖాదర్ ఆలీ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# నాణ్యమైన ఎరువుల్ని, విత్తనాల్ని సరఫరా చేయాలి

**– జిల్లా కలెక్టర్ అంకిత్**

**– వానాకాలం ఎరువులు, విత్తనాలు సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం**




**భద్రాద్రి కొత్తగూడెం, మే 06 (మనంప్రతినిధి):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1 లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు అవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్నారు.

ఎరువుల నిల్వాలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ జిల్లా మరియు మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల 20లో..

# ఖమ్మంలో అభివృద్ధి దూకుడు

-మంత్రి తుమ్మల దిశానిర్దేశంతో ప్రగతి పథం
- 20 ఎకరాల్లో వెంకటేశ్వర స్వామి ఆలయానికి మంత్రివర్గ ఆమోదం
- డీఎఫ్టీతో ఇంటికే మినరల్ నీరు దేశానికి ఆదర్శ ప్రాజెక్ట్
-మూడున్నరేళ్లలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు
- డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ రంగాల్లో విస్తృత పనులు
- పేదలకు గృహాలు, మౌలిక సదుపాయాలు
- తుమ్మల దూరదృష్టి, పట్టుదలతో ఖమ్మం కొత్త దశలోకి
- మేయర్ పునకొల్లు నీరజ, 15 డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణసైదుబాబు..




**ఖమ్మం, మే 6(మనం బ్యూరో):** ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందుచూపు, కార్యదక్షతతో అభివృద్ధి దూసుకెళ్తోందని నగర మేయర్ పునుకొల్లు నీరజ, 15వ డివిజన్ రావూరి కరుణా సైదుబాబు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడున్నర సంవత్సరాల్లో సుమారు రూ.100 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నగర అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించడమే విజయానికి కారణమని చెప్పారు. ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూరేలా పనులు అమలు చేస్తున్నారని వివరించారు. మౌలిక సదుపాయాల విస్తరణలో మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ వేగవంతం చేస్తున్నారని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని చెప్పారు. తుమ్మల పట్టుదల వల్లే ఈ మార్పు సాధ్యమైందని స్పష్టం చేశారు.

**టీటీడీ దేవాలయం ఖమ్మానికి ప్రతిష్ఠాత్మక గుర్తింపు**

ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో 20 ఎకరాల్లో వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రావూరి కరుణా సైదుబాబు తెలిపారు. ఈ ఆలయం నగరానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారీ స్థాయిలో భక్తులను ఆకర్షించే ఆధ్యాత్మిక కేంద్రంగా ఇది అభివృద్ధి చెందనుందని చెప్పారు. ఆలయ నిర్మాణంతో పర్యాటక రంగానికి ఊతం లభిస్తుందని వివరించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఇది దోహదపడనుందని అన్నారు. టీటీడీ ప్రమాణాలతో నిర్మాణం జరగనుందని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కోసం మంత్రి తుమ్మల ప్రత్యేకంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ముందుచూపు వల్లే ఖమ్మానికి ఈ గౌరవం దక్కిందని తెలిపారు. అదేవిధంగా టిటిడి బోర్డులో బుధవారం ఆమోదం తెలిపినందుకుగాను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**డీఎఫ్టీ ప్రాజెక్ట్ ఇంటికే మినరల్ నీరు**

దేశంలోనే తొలిసారిగా డీఎఫ్టీ (డ్రింక్ ఫ్రమ్ టాప్) ప్రాజెక్ట్ ఖమ్మంలో ప్రారంభం కానుందని మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ రావూరి కరుణా సైదుబాబు వెల్లడించారు. ఈ పథకం ద్వారా ట్యాప్ తిప్పగానే నేరుగా మినరల్ నీరు అందనుందని తెలిపారు. మొదటగా 15వ డివిజన్ పరిధిలో ఈ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్లు చెప్పారు. అమృత్ పథకం, మునిసిపల్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వేలాది కుటుంబాలకు శుద్ధి చేసిన తాగునీరు అందనుందని వివరించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇది కీలక అడుగని అన్నారు. ఆధునిక సాంకేతికతతో నీటి శుద్ధి వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దేశానికి ఆదర్శంగా నిలిచే ప్రాజెక్టుగా ఇది మారనుందని చెప్పారు. ఈ ప్రణాళిక కూడా మంత్రి తుమ్మల దూరదృష్టి ఫలితమేనని స్పష్టం చేశారు.

**రూ.100 కోట్లతో మౌలిక సదుపాయాల విస్తరణ**

నగరంలో రూ.100 కోట్లకు పైగా నిధులతో డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ రంగాల్లో పనులు కొనసాగుతున్నాయని రావూరి కరుణా సైదుబాబు తెలిపారు. కొత్తగూడెం స్కూల్ నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.50 లక్షలతో డ్రైన్ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. పశువుల ఆసుపత్రి నుంచి బస్తీ దవాఖానా వరకు డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని వివరించారు. పలు ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు. పీబీ నగర్లో విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఎన్ఎస్పీ కాల్వ వరకు సీసీ డ్రైన్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. నగర మౌలిక వసతులు బలోపేతం అవుతున్నాయని వివరించారు. ఈ పనులన్నీ మంత్రి తుమ్మల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

**పేదలకు గృహాలు సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు**

పేదల కోసం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి త్వరలో పంపిణీ చేయనున్నట్లు రావూరి కరుణా సైదుబాబు తెలిపారు. ఎస్సీ కాలనీలలో సీసీ రోడ్లు, యూజీడీ పనులు చేపట్టినట్లు చెప్పారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వైకుంఠ ధామం వరకు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం జరుగుతోందన్నారు. స్కూల్ భవనాలు నిర్మాణంతో విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పుట్టకోట ప్రాంతంలో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పుట్టకోట నుంచి అల్లిపురం వరకు బీటీ రోడ్లు నిర్మాణం కొనసాగుతోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి జరుగుతోందని వివరించారు. ఈ మార్పుకు మంత్రి తుమ్మల పట్టుదలే కారణమని తెలిపారు.

**తుమ్మల ముందుచూపుతో ఖమ్మం కొత్త దశలోకి**

ఖమ్మం నగర అభివృద్ధిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషిస్తున్నారని రావూరి కరుణా సైదుబాబు పేర్కొన్నారు. ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించడం ఆయన ప్రత్యేకతగా తెలిపారు. ప్రతి పనిని సమయానికి పూర్తి చేయడంలో కార్యదక్షత చూపుతున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించే నాయకుడిగా ఆయన నిలిచారని వివరించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మాన్ని దేశానికి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. టీటీడీ దేవాలయం, డీఎఫ్టీ వంటి ప్రాజెక్టులు ఆయన దూరదృష్టికి నిదర్శనమని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. తుమ్మల నాయకత్వంలో ఖమ్మం కొత్త శకానికి నాంది పలుకుతోందని స్పష్టం చేశారు.

# ప్రతి ప్రసవం సురక్షితం

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు**

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రతి ప్రసవం సురక్షితం అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలో గర్భిణీ స్త్రీల సురక్షిత ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు సూచించారు. తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ప్రసవం సురక్షితం అనే లక్ష్యంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.గర్భధారణ నిర్ధారణ అయిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పేరును నమోదు చేసుకొని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గర్భిణీలు కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవడం, రక్తపోటు, రక్తహీనత, షుగర్ వంటి సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. గర్భిణీ స్త్రీలను రెగ్యులర్ గా ఫాలో అప్ చేసి, హై రిస్క్ కేసులను గుర్తించాలని, సమయానుకూలంగా రెఫెరల్ చేయాలని, వైద్యాధికారులు, ఫీల్డ్ స్టాఫ్, ఆశా కార్యకర్తలందరు కూడా, ప్రతి గర్భిణీ స్త్రీ ని సురక్షితంగా నార్మల్ డెలివరీ గా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో అయ్యేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. 100% ట్రాకింగ్ హైరిస్కే కేసులను గుర్తించి, సాధారణ ప్రసవాలు అయ్యేలాగా ప్రోత్సహించాలని, జీరో పర్సెంట్ మెటర్నల్ డెత్ గా జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు, ప్రసవ సదుపాయాలు 24 గంటలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 102, 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే గర్భిణీలు పోషకాహారం తీసుకోవడం, ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా వాడడం, టీకాలు వేయించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఇంటి ప్రసవాలకు దూరంగా ఉండి, ఆసుపత్రుల్లోనే ప్రసవం జరగేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. సురక్షిత ప్రసవం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని ప్రతి ప్రసవాన్ని సురక్షితంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.

# మొక్కజొన్న, జొన్నలు కొనుగోలు నిర్ణయం అభినందనీయం

**కేంద్రం సహకరించకపోయినా రైతులకు న్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** మొక్కజొన్నలతోపాటు జొన్నలను కొనుగోలు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిందని, కేంద్ర (బి జె పి) ప్రభుత్వం మొక్కజొన్నలకు మద్దతు ప్రకటన వరకే పరిమితమైందని ఆచరణ శూన్యం అని కళ్ళు ఉండి చూడలేని వారిలా రాష్ట్ర బి జె పి ఎంపీ లు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. భారమైనా రైతులకు న్యాయం చేయాలనే సధుద్దేశంతో ప్రజాపాలన గావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్నల కొనుగోలు మార్కఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నదని, మక్కలతో పాటు జొన్నలు కొనుగోలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని హర్షం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులకు ఖమ్మం జిల్లా రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఒక్క సంవత్సరంలోనే ప్రభుత్వం వివిధ పంటల కొనుగోలుకు 6 వేల కోట్ల వరకు వ్యయం చేసిందని, మొక్కజొన్న, జొన్న పంటలను పి ఎస్ ఎస్ (ప్రైస్ సపోర్ట్ స్కీమ్) పరిధిలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణాలో రైతుల శ్రేయస్సు కోసం రైతు సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అదే జిల్లాకు చెందిన మంత్రి వర్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ రఘునందనరావుపై మండిపడ్డారు, చేతనయితే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రైతు సంక్షేమానికి పాటుపడాలని హితవు పలికారు. వారి వ్యాఖ్యలు గర్హనీయమని అన్నారు.

# మానవాళి విముక్తి సిద్ధాంతమే మార్క్సిజం

## సిపియం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** సమస్త ప్రజలను దోపిడీ నుంచి విముక్తి చేసే సిద్ధాంతమే మార్క్సిజమని సిపియం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపియం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అధ్యక్షతన జరిగిన మార్క్సిజం సమకాలీనత సవాళ్ళు అనే అంశంపైన జరిగిన చర్చా కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్ల్ మారక్స్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించి మార్క్సిజం ప్రాధాన్యత గురించి వివరించారు. పెట్టుబడిదారీ సమాజంలో ఆర్థిక సంక్షోభం రోజు రోజుకు తీవ్రమవుతోందని ఆయన అన్నారు. ఇప్పుడు ఇది యుద్ధ రూపంలో ప్రపంచాన్ని కబళించేలా ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. ఇది ఒక దేశానికి ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదని, ఇది ప్రపంచ వ్యాపిత సమస్య అని తెలిపారు. దీని వలన నిరుద్యోగం,ధరల పెరుగుదల విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంకెలు, జీడీపీ లెక్కలలో దేశ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలపడుతున్నట్లు పెట్టుబడిదారీ మీడియా సంస్థలు, మేధావులు ఊదరగొడుతున్నారని ఇదంతా తప్పుడు ప్రచారమని ఆయన తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి తీవ్రంగా తగ్గిపోతోందని దీంతో ప్రజలు కనీస అవసరాలను కూడా తీర్చుకునేందుకు అవసరమైన వస్తు సేవలను వినియోగించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభ కాలంలో ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. అయితే అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు ప్రజలను గాలికి వదిలేసి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే పనిలో ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వాలు ఇలానే పెట్టుబడుదారుల, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ప్రయోజనాల కోసమే పని చేస్తాయని, ప్రజలను దోచుకునే వారికి పూర్తి స్థాయిలో సహకరిస్తాయని మారక్స్ చేసిన విశ్లేషణను ఆయన వివరించారు. సమాజంలో అందరికీ సౌకర్యవంతమైన జీవన ప్రమాణాలు అందాలంటే దోపిడి వర్గ పెట్టుబడిదారీ సమాజంలో అది సాధ్యం కాదని ఆయన తెలిపారు. ఏయే బడా వ్యాపారవర్గాలు,కార్పొరేట్ కంపెనీలైతే ప్రజల శ్రమను జ్ఞానాన్ని దోచుకొని సంపదను తమ ఇళ్ళకు తరలిస్తున్నాయో ఆ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడినప్పుడే సమస్త సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఈ పోరాటాన్నే మారక్స్



వర్గ పోరాటం అన్నారని , వర్గ పోరాటం ద్వారానే ప్రజలందరికీ అనుకూలమైన మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు ఓపికగా వివరిస్తూ,చైతన్య పరుస్తూ వారిని వర్గ పోరాటాలకు సిద్ధం చేయడమే కమ్యునిస్టుల కర్తవ్యం అని ఆయన స్పష్టం చేశారు. కమ్యునిస్టులు నిరంతరం పాలక దోపిడీ వర్గాలకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తూ ఉంటారు కాబట్టే వారి శక్తిని తగ్గించే ప్రయత్నం చేస్తారని అన్నారు. అందులో భాగంగానే ఎన్నికలలో కమ్యునిస్టులను ఓడించడం కోసం అన్ని రకాల దోపిడీ వర్గ పార్టీలు ఏకం అవుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కమ్యునిస్టులకు ఓట్లు సీట్లు కూడా తగ్గుతాయని ఇది సాధారణ విషయమని తెలిపారు. అయితే కమ్యునిస్టుల బలం కేవలం ఓట్లు సీట్లలో మాత్రమే ఉండదని వారి బలం ప్రజలను ఐక్యం చేస్తూ ప్రజా ఉద్యమాలను నిర్మించే కృషిలో ఉంటుందని అన్నారు. ఈ పనిని ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజలను అంటి పెట్టుకొని వారిని కుల మత ఇతర విభజన వాదాలకు అతీతంగా ఐక్య పరచడం ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ తరహా సిద్ధాంత కార్యాచరణ విశ్లేషణను కార్ల్ మార్క్స్ చాలా స్పష్టంగా తన రచనలో చేశారని అన్నారు. ఈ అవగాహనతో ప్రజలతో మమైకమై ప్రజల కోసం పని చేయడం ద్వారానే కార్ల్ మార్క్స్‌కు నిజమైన నివాళి అర్పించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపియం సీనియర్ నాయకులు యం.సుబ్బారావు, సిపియం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, విద్యా విభాగం నాయకులు బోడపట్ల రవీందర్ , రఫీ తదితరలు పాల్గొన్నారు.

మనం



ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాథపాలెం



# త్రివేణి టెన్త్ స్టేట్ టాపర్స్‌ను అభినందించిన రెవిన్యూ మంత్రి పొంగులేటి

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయి లో 595 మార్కు లు సాధించిన త్రివేణి విద్యార్థిని నేహా, 586 మార్కులు సాధించిన హరిచందన,హర్షవర్ధన్ 585 మార్కులు సాధించిన దేవీ వెంకట సాయి,583 మార్కులు సాధించిన రోహన్ సాయి, అఖిల్,582 మార్కులు సాధించిన శ్యామ్ శ్రీ, రిషిత, 581 మార్కులు సాధించిన సాయి దీక్షిత్, రోహిత్ కృష్ణ,తదితర రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను స్థానిక రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. భవిష్యత్తులో కూడా త్రివేణి విద్యార్థులు దిన దిన ప్రవర్ధమానం గా వెలుగొందాలని, విద్యార్థులందరినీ అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లాలని, ఆవిధంగా వారిని తీర్చిదిద్దాలని యాజమాన్యానికి సూచించారు. విద్యార్థిని విద్యార్థులను మంత్రి అభినందించడం పట్ల పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా 23వ డివిజన్

- మక్బూల్ సేవలు అభినందనీయం
- పువ్వాడ అజయ్ అడుగుజాడల్లో ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చిన నేత
- అభినందన సభలో శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘన సత్కారం
- అభినందన సభలో ప్రత్యేక ఆకర్షణగా ఐదేళ్ల ప్రజాసేవ ఫోటో ఎగ్జిబిషన్..
- నా శ్వాస ఉన్నంతవరకు గులాబీ జెండా నీడలోనే ఉంటా
- ఎస్.కె. మక్బూల్





**ఖమ్మం, మే 06(మనం న్యూస్):** 23వ డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందిన మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ సేవలను పలువురు నాయకులు కొనియాడారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లో ఆయన పదవీకాలం ముగిసిన సందర్భంగా ముస్తఫానగర్ కమ్యూనిటీ హాల్లో ఘన అభినందన సభ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా హాజరై పుష్పగుచ్చాలు, శాలువాలతో మక్బూల్ను సత్కరించారు. సభ అంతా అభిమానంతో, భావోద్వేగంతో నిండిపోయింది.ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్కుమార్, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ 23వ డివిజన్ను అభివృద్ధి దిశగా నడిపించిన నాయకుడు మక్బూల్ అని ప్రశంసించారు. రాజకీయాల్లో వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ, ప్రజల సంక్షేమాన్నే ధ్యేయంగా తీసుకుని పనిచేసిన ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలకు అండగా నిలిచి ఉచిత మందుల పంపిణీ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, అంగన్వాడీల అభివృద్ధి, పార్కుల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా కమ్యూనిటీ హాల్ ద్వారా నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో మక్బూల్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం మాజీ కార్పొరేటర్ షేక్ మక్బూల్ మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా కుటుంబానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో, నా డివిజన్ ప్రజలకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తాను. ప్రజల ఆశీస్సులు, నాయకుల ప్రోత్సాహమే నా రాజకీయ ప్రస్థానానికి బలం,' అని పేర్కొన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతోనే అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టగలిగానని చెప్పారు.'నేను పార్టీ మారే ప్రసక్తే లేదు. నా శ్వాస ఉన్నంతవరకు గులాబీ జెండా నీడలోనే కొనసాగుతాను,' అంటూ బీఆర్ఎస్ పట్ల తన నిబద్ధతను స్పష్టం చేశారు. ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుంటానని, పదవి ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేయడం ఆపబోనని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ షేక్ మగ్బుల్ అభినందన సభలో ఏర్పాటు చేసిన 23వ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు చెందిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మక్బూల్ స్నేహితులు షేక్ ఇస్మాయిల్, గడ్డం లింగమూర్తి, సభాధ్యక్షులు రాంరెడ్డి, లియాకత్ అలీ, కన్నోజు కిరణ్ కుమార్, సయ్యద్ షఫీ, స్థానిక బి ఆర్ఎస్ నాయకులు ఎస్ కే ఇలియాస్, ఎస్కే లాల, కరీముల్లా, సలీం, అజ్జు, 21 వ డివిజన్ అధ్యక్షులు ఉస్మాన్, మునాఫ్, జాకీర్, ఎంపీజే అధ్యక్షులు ఖాసిం విశ్రాంత డ్రైవర్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు హకీమ్, బి ఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, నసీర్, మహిళ సంఘం నేతలు ఎల్ ఝాన్సీ, సలీమా బేగం, జ్యోతి, విమల, ఆర్పీ మహేశ్వరి, బతుకమ్మ, శ్రీలత, రాణి, తదితరులు పాల్గొన్నారు.

# మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు



**నేలకొండపల్లి, మే 6 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు 28 నెలలు గడుస్తున్న ఎన్నికల ముందు యువకులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత మాటలతో కాలయాపన చేస్తుందన్నారు. ప్రతి ఏడాది లక్ష ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ ప్రకటించడంతోపాటు నిరుద్యోగ భృతి కల్పిస్తామని, చదువుకునే ప్రతి విద్యార్థినికి స్కూటీని ఉచితంగా అందిస్తామని, రాజీవ్ వికాస పథకం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని చెప్పిన ప్రభుత్వం మొండి చేయి చూపించిందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోవడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని అడిగిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## నూతన డీజీపీ సివి ఆనంద్‌కు బీసీ సంఘం శుభాకాంక్షలు



**తిరుమలాయపాలెం మే 6 (మనం న్యూస్)** తిరుమలాయపాలెం: తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్‌కు బీసీ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కాంపాటి వెంకట్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు రాష్ట్ర పోలీస్ శాఖ ప్రజల భద్రత, శాంతి భద్రత పరిరక్షణలో మరింత సమర్థవంతంగా సేవలందించాలని కోరారు బీసీ సమస్యల పరిష్కారంలో పోలీసుల సహకారం అవసరమని తెలిపారు అక్రమంగా నమోదవుతున్న అట్రాసిటీ కేసుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు సివి ఆనంద్ నాయకత్వంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ న్యాయపరమైన సేవలు అందించాలని కోరారు పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు మేత పోతుల రమేష్, సంజయ్, ఓంకార్, విజయ్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు, సబ్సిడీలపై అవగాహనా సదస్సు

**తిరుమలాయపాలెం, మే 6 (మనం న్యూస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం తిరుమలాయపాలెం రైతు వేదికలో మూడో రోజు కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకింగ్, సహకార సంఘాలు, మార్కెటింగ్ సదుపాయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి, సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామిరెడ్డి, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ శ్రీలత పాల్గొన్నారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, పంట రుణాలు పొందే విధానం, అర్హత ప్రమాణాలను వారు వివరించారు. సహకార సంఘాల ఏఆర్ రామిరెడ్డి మాట్లాడుతూ, "సహకార సంఘాల ద్వారా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను సబ్సిడీ ధరలకు పొందవచ్చు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా కంపెనీ ధరలకే ఎరువులు, విత్తనాలు అందుతాయి. రైతులు తక్కువ వడ్డీకే పంట రుణాలు తీసుకొని వ్యవసాయ పెట్టుబడికి వినియోగించుకోవాలి" అని సూచించారు. డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ శ్రీలత మాట్లాడుతూ, "రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ లభిస్తుంది. తక్కువ వడ్డీకే రుణాలు పొందేందుకు రైతు సోదరులు గడువులోగా రుణాలు చెల్లించాలి" అని కోరారు. ఎంఏఓ నారెడ్డి సీతారామరెడ్డి మాట్లాడుతూ, కనీస మద్దతు ధర ప్రమాణాలను, ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, రైతు సోదరీమణులు పాల్గొన్నారు.

## పేదల ముంగిటకే 'ప్రజాపాలన

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
### మే నెలాఖరుకు రెండో విడత మంజూరు
### 35 రోజుల్లోనే సాదా బైనామా
### సమస్యల పరిష్కారం
### రైతులకు రుణమాఫీ, మద్దతు ధరతో కొండంత అండ
### గువ్వలగూడెం ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**నేలకొండపల్లి, మే 6 (మనం న్యూస్):** రాష్ట్రంలో పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు లేకుండా, పాలనను నేరుగా వారి గడప వద్దకే తీసుకువచ్చాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకరతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు. నాడు వరి వేస్తే ఉరి అన్న పరిస్థితి ఉండేదని నేడు ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామన్నారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.21 వేల కోట్ల రుణమాఫీతో 25 లక్షల మంది రైతులకు విముక్తి కల్పించామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల సాయం అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు లేని నిరుపేదలకు గృహ కల్పన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేసామని మే నెలాఖరు నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. భూ సమస్యలను 'భూ భారతి' ద్వారా ప్రక్షాళన చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను రాబోయే 35 రోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా వంటి పథకాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును గరిష్టంగా మూడు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



**నేలకొండపల్లి, మే6 (మనం న్యూస్) :** నేలకొండపల్లి మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న సమస్యలపై తెలంగాణ రైతు సంఘం, సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో కలెక్టర్కు విన్నవించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొక్కజొన్న, ధాన్యం ఎగుమతుల్లో నెలకొన్న సమస్యలపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత కొద్ది రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేసి నిల్వ ఉన్న బస్తాలు సైతం తడిచి పోవడంతో రైతులకు తీరని నష్టం వాటిలిందన్నారు. వందల సంఖ్యలో ధాన్యం, మొక్కజొన్న రాశులు తడిసి ముద్దోవడంతోపాటు వరద నీటిలో కొట్టుకొని పోయాయన్నారు. కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం సంబంధిత అధికారులు రైతులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు మొక్కజొన్న ధాన్యాన్ని తరలించి 15 నుండి 20 రోజులు గడుస్తున్నా సకాలంలో కాంటాలు వేయకపోవడం, వేసిన వాటిని కూడా రవాణా చేయకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. స్పందించిన కలెక్టర్ బోదులబండ గ్రామంలో జరిగిన ప్రజాదర్బార్లో మీరిచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చామని సాధ్యమైనంత తొందరలోనే సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. కలెక్టర్కు వినతి పత్రం అందించిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, ఇంటూరి అశోక్, మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు నిర్ణిత సమయంలో పూర్తి చేయాలి

### మండల స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ ఈఈ పిడి బి. శ్రీనివాసరావు



**తిరుమలాయపాలెం మే 6 (మనం న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు నిర్ణిత సమయంలో నిర్మాణం చేపట్టి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని లబ్ధిదారులను తొర్తిగతన ఇండ్లు నిర్మాణం చేసేందుకు సర్పంచ్ లు ఉపసర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ ఈఈ పిడి బి. శ్రీనివాసరావు అన్నారు. మండల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు సర్పంచులతో ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో 810 లబ్ధిదారులకు మంజూరు అయ్యాయని దానిలో ఇప్పటివరకు 610 పూర్తికాగా 200 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని ఆయన తెలిపారు దీనిలో 290 గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు సర్పంచ్ ఉపసర్పంచ్ లు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని తమ గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు సూచనలు సలహాలు ఇస్తూ ఇందిరమ్మ ఇండ్లు మే చివరి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే తిరుమలాయపాలెం మండలం లో వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు పూర్తిచేసుకున్న 209 ఇండ్లకు సుమారు 15 కోట్ల 60 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ అయినట్లు ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టవలసిన పనులపై కూలీల హాజరు శాతాన్ని పెంచేందుకు సంబంధిత సర్పంచ్ ల కు పంచాయతీ కార్యదర్శులకు మేట్లకు ఫీల్డ్ అసిస్టెంట్లకు రివ్యూ సమావేశం నిర్వహించారు. సీఈ మనోహర్, సర్పంచ్ లు వనవాసం నరేందర్ రెడ్డి గడిపూడి వెంకటనారాయణ కర్నాటి రాజేంద్ర ప్రసాద్ నందిపాటి మల్లికార్జున్ ధరావత్ వెంకన్న గుమ్మడి దేవబిక్షం బానోత్ సిమ్లా చిర్ర నర్సమ్మ మందుల అరుణ కొవ్వూరి పద్మ బోడ మంజు నల్లమల్ల కీర్తి , ఆరెంపల వినోద బానోత్ అనిల్ కుమార్ జడల సుష్మ అన్నేపర్తి రవి కామల్ల సువార్త బి కుమారి తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు రైతుల ఆందోళన

## గన్ని సంచుల కొరత..
## మిల్లులకు ధాన్యం తరలింపుకు డిమాండ్

**కొణిజర్ల, మే 6(మనం న్యూస్)** మండల పరిధిలోని మల్లుపల్లి, పల్లిపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు పండించిన పిఆర్-126 వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేశారు. బుధవారం కొణిజర్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద కాటాలు వేసిన ధాన్యం బస్తాలను సమీప రైస్ మిల్లులకు తరలించే అవకాశం కల్పించడంతో పాటు గన్ని సంచులు సరఫరా చేయాలని రైతులు చేసిన ఆందోళనకు తెలంగాణ రైతు సంఘం, గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ, గత 40--50 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసి రైతులు కాటాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గన్ని సంచుల కొరత, లారీల లభ్యత లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు అనుమతి ఇస్తే రైతులు తమ స్వంత వాహనాలతో బస్తాలను తరలించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మండల డిప్యూటీ తహశీల్దార్ రాము, వ్యవసాయ శాఖ మండలాధికారి బాలాజీతో రైతులు, ప్రజా సంఘాల నాయకులు చర్చలు జరిపారు.



రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ద్వారా జిల్లా సివిల్ సప్లై అధికారులకు సమస్యలు వివరించగా, అధికారులు స్పందించి పిఆర్-126 వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైస్ మిల్లర్లు అదనపు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. వెంటనే గన్ని సంచులు సరఫరా చేసి కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.అనంతరం వరి ధాన్యం కొనుగోలు సమస్యపై వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు తాళ్ళపల్లి కృష్ణ, జిల్లా సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు, మల్లుపల్లి మాజీ సర్పంచ్ రాయల నాగేశ్వరరావు, కోయిన్ని భద్రయ్య, దామా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

## వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు

**వైరా, మే 06 (మనం న్యూస్):** రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న రైతు వారోత్సవంలో భాగంగా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించే క్రమంలో మూడో రోజైన బుధవారం వైరా రైతు వేదికలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, బ్యాంకింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలు అందించాలని సూచించారు. అప్పుడు రైతుకు పూర్తిగా పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని, రైతులు ఒకే పంటను పండించకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, కొత్తగా వస్తున్న మార్పులపై దృష్టి సారించి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా పంటలు పండించాలని సూచించారు. పంటల సాగుతో పాటు, పండించిన పంటల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ వంటి



సౌకర్యాలు వినియోగించుకొని పంటలు నిల్వ చేసుకోవడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వరిలో ఎల్లప్పుడూ దొడ్డు బియ్యం కాకుండా, డిమాండ్ ఉన్న సన్న బియ్యం ఇతర రకాల ధాన్యాన్ని పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కాపా మురళి కృష్ణ , ఎంపీడీఓ సక్రియ నాయక్ , మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజు ఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి మేడ రాజేష్ ,సొసైటీ సీఈఓ రామకృష్ణ ,మార్కెటింగ్ సెక్రటరీ, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ , మార్కెటింగ్ డైరెక్టర్ సిబ్బంది గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# బావిలో మునిగి బాలుడు మృతి



## పెళ్లి వేడుకలో విషాదం....

**కొణిజర్ల, మే 6 (మనం న్యూస్) :** ఈతకు వెళ్లి బావిలో మునికి బాలుడు మృతి చెందిన సంఘటన కొణిజర్ లో చోటుచేసుకుంది .కొణిజర్ల మండలం చిన్నగోపతి గ్రామంలో పెళ్లి వేడుక విషాదంలో మునిగిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. వైరా మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన బాల్ది వెంకటేశ్వర్లు కుమారుడు అరవింద్ (13) తన నాయనమ్మ కౌసల్యతో కలిసి బంధువుల పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు చిన్నగోపతి గ్రామానికి వచ్చాడు. పెళ్లి హడావుడిలో ఉండగా, అరవింద్ తన స్నేహితులు పగడాల అభిలాష్, పగడాల మోహన్ సాయి, పగడాల ప్రవీణ్, జడ లోకేష్‌లతో కలిసి మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో గ్రామ శివారులో గ్రీన్ ఫీల్డ్ హైవే సమీపంలోని కొలుపుల వీరభద్రం వ్యవసాయ భూమిలో ఉన్న బావి వద్దకు ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత రాకపోయినా బావిలోకి దిగిన అరవింద్, నీటి లోతును అంచనా వేయలేక ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని బావిలో గాలించి అరవింద్‌ను బయటకు తీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనతో పెళ్లి వేడుకలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని గ్రామస్థులు బావి నీటి అడుగు నుంచి వెలికితీసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డీఆర్డీఏ ప్రశంసలు పొందిన వర్కింగ్ మేట్

**కొణిజర్ల, ఏప్రిల్ 06 (మనం న్యూస్)** గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదులో మేకాల కుంటకు చెందిన వర్కింగ్ మేట్ నవీన్ ప్రతిభ కనబరిచాడు. ఒకే రోజులో అత్యధికంగా 120 మంది కూలీలకు ముఖ గుర్తింపు ఫోటోలు తీసి యాప్‌లో విజయవంతంగా అప్లోడ్ చేసి ప్రత్యేక గుర్తింపు పొందాడు.నవీన్ చేసిన ఈ కృషిని గుర్తించిన డీఆర్డీఏ పీడీ శ్రీరామ్ ఆయనను అభినందిస్తూ రూ.1000 నగదు ప్రోత్సాహం అందించారు.వర్కింగ్ మేట్ నవీన్ చేసిన ఈ పని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిడీ రామకృష్ణ, ఫీల్డ్



అసిస్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు



# సోలార్ విద్యుత్ వినియోగంతోనే దీర్ఘకాలిక ప్రయోజనం

## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి, మే06 (మనం న్యూస్) :** సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచి అదనపు విద్యుత్ చార్జీల బిల్లుల భారం నుండి దీర్ఘకాలిక ప్రయోజనం పొందాలని,ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో లాభదాయకంగా మారడంతో పాటు పొగ కాలుష్యాన్ని కూడా నివారించవచ్చని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు.సింగరేణి మండల కేంద్రంలో హనుమకొండ రమేష్ నూతనంగా ప్రారంభించిన ఆమీటి ఇండియా ఇవి వెహికల్స్ అండ్ జనరల్ స్టోర్ ను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా అనంతరం ప్రజల్లో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పెరిగిపోయాయని,ఈ క్రమంలోనే హెల్త్ అండ్ వెల్ నెస్ ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపారాలు విజయవంతంగా నడుస్తున్నాయని అన్నారు.కమర్షియల్, ఇండస్ట్రియల్ సముదాయాల్లో పెరిగిపోయిన కరెంటు బిల్లులకు ప్రత్యామ్నాయంగా సోలార్ వినియోగం పెరగాలని సూచించారు.మారుమూల ప్రాంతాల్లో కూడా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ),సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,రిటైర్డ్ ఉద్యోగి బానోత్ సుందర్ లాల్,ఎస్సై బైరు గోపి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, అమీటి ఇండియా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

# రైతు వారోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనండి

## -ఎన్పీడీసీఎల్ ఏఈ వెంకన్న



**కారేపల్లి, మే06 (మనం న్యూస్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని రొట్టమాకిరేవు రైతువేదికలో బుధవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్పీడీసీఎల్ ఏఈ వెంకన్న కోరారు.మే నెల ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటలకే సమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొంటారని తెలిపారు.99 రోజుల ప్రజా ప్రణాళిక పాలన కాలంలో విద్యుత్ శాఖ తరపున,ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధి,పురోగతి కార్యక్రమాల గురించి ఈ సమావేశంలో నివేదికను ప్రజల ముందు ఉంచుతామని అన్నారు.

# సర్వైకల్ క్యాన్సర్ నివారణకు టీకా అవసరం: రమణ

**కొణిజర్ల, మే 6 (మనం న్యూస్)** సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా అత్యంత అవసరమని జిల్లా వాక్సిన్ మేనేజర్ డి.వి.ఎల్.ఎమ్ రమణ పేర్కొన్నారు. బుధవారం కొణిజర్ల మండలంలో నిర్వహిస్తున్న సాధారణ హెచ్‌పీవీ టీకా కార్యక్రమాలను ఆయన



పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరైన బాలింతలు, గర్భిణీలకు టీకాల ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా 14-15 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకా అందిస్తున్నామని, ఈ టీకా సురక్షితమైనదిగా సమర్థవంతమైనదిగా ఉండటంతో తల్లిదండ్రులు తమ ఆడ పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షణ పొందేందుకు ఈ టీకా కీలకమని తెలిపారు.కొణిజర్ల మండలంలోని కొణిజర్ల, పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని దినాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టీకాలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మోనిక శృతి, సీహెచ్ఓ దుర్గమల్లేశ్వరి, నర్సింగ్ ఆఫీసర్ రజని, ఎఎన్ఎం ఉమా, హెల్త్ అసిస్టెంట్ నర్సింహారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మనం



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

## అమ్మ పిల్లల ఆస్పటల్ ను సందర్శించిన మున్నూరు కాపు నాయకులు



**మధిర టౌన్, మే 6 (మనం న్యూస్) :** మధిర మున్సిపాలిటీ లోని వైరా రోడ్ నందు అమ్మ పిల్లల ఆస్పటల్ ను నూతనంగా ప్రారంభించిన డాక్టర్ దగ్గుపాటి శ్రీను కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, ను మధిర నియోజకవర్గ మున్నూరు కాపు నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ళ కృష్ణ మరియు మున్నూరు కాపు నాయకులు డాక్టర్ శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలుపుతూ చిరు సత్కారం చేశారు. తదనంతరం హాస్పటల్ సందర్శించినారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మరియు మధిర మున్నూరు కాపు నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ, నీలం వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, దేవి శెట్టి కృష్ణ , లంకే మల్ల నాగేశ్వరరావు ,వీరశెట్టి సీతారాములు, ధనిశెట్టి భాస్కర్, చెన్నం స్వామి చిన్నం వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీను, పాలెపు వెంకటేశ్వరరావు, సిద కృష్ణ, ఇల్లూరి నవీన్, పగడాల శివ, నల్గొండ నరసింహారావు, శంకర్ శెట్టి వెంకటేశ్వరరావు, మత్తి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

## సహకార సంఘాల ద్వారా రైతుకు మేలు ఏఎంసి ఛైర్మన్ బండారు



**మధిర, మే6(మనం న్యూస్):** మధిర రైతు వేదిక నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతు వారోత్సవాల సదస్సులో ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు హాజరై రైతులనుద్దేశించి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు చేస్తున్నటువంటి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసాద్, మార్కెట్ కమిటీ సెక్రటరీ నాగేశ్వరి, బ్యాంక్ మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.



## తాళ్ల సందీప్ కుటుంబానికి లింగాల కమలరాజ్ పరామర్శ

**ముదిగొండ మే 6(మనం న్యూస్):** ముత్తారం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు తాళ్ల రమేష్ కుమారుడు ఇటీవల సందీప్ మృతి నేపథ్యంలో మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమలరాజ్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, వారి దుఃఖంలో తాను కూడా భాగస్వామినని తెలిపారు. అదేవిధంగా, బీఆర్ఎస్ నాయకురాలు లంజపల్లి మహాలక్ష్మి కూతురు ఇటీవల గుండెపోటుతో మరణించిన కుటుంబాన్ని కూడా పరామర్శించి వారికి సానుభూతి తెలిపారు. సందీప్ మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన కమలరాజ్, కుటుంబ సభ్యులు చేసిన నేత్రదానం మరియు గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ విరాళం కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా యూత్ నాయకులు బండ్ల వాసు మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, కార్యదర్శి గడ్డం వెంకట్,మాజీ సొసైటీ చైర్మన్ బత్తుల వెంకట్రావు, గ్రామ అధ్యక్షులు వల్లభనేని ప్రభాకర్ రావు, మండల నాయకులు మూల శ్రీనివాస్, తాళ్ల రామారావు, నారపొంగు వెంకటి, నాదెండ్ల లక్ష్మయ్య కోప్పుల ఉపేందర్, దాసరి రామారావు, అమరగాని రామయ్య,పరికపల్లి యల్లయ్య, వట్టే నాగరాజు, వట్టే సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## 10న ప్రధాని మోడీ బహిరంగ సభను జయప్రదం చేయండి

### మధిర ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో నరేంద్ర మోడీ సభకు తరలి రావాలి: బిజెపి రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి




**మధిర, మే 6 (మనం న్యూస్):** మధిర లో అసెంబ్లీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో కార్యక్రమానికి ముఖ్య అతిథి కొండపల్లి శ్రీధర్ రెడ్డి పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ
వికసిత్ తెలంగాణ లక్ష్యంగా 8 వేల కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనతో శ్రీకారం చుట్టనున్న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీ న సాయంత్రం నాలుగు గంటలకు పరేడ్ గ్రౌండ్స్ లో జరగనున్న బహిరంగ సభకు మధిర అసెంబ్లీ నుంచి పెద్ద సంఖ్యలో బిజెపి కార్యకర్తలు నరేంద్ర మోడీ గారి అభిమానులు కదలి రావాలని వారు కోరారు. ఈ మేరకు మధిర అసెంబ్లీ నుండి ప్రత్యేక రైలు కూడా ఏర్పాటు చేశామన్నారు ప్రతి పోలింగ్ బూత్ నుండి అధిక సంఖ్యలో నరేంద్ర మోడీ సభకు తరలి వెళ్లి సభను విజయవంతం చేయాలని , ముఖ్య నాయకుల సమావేశంలో దిశ నిర్దేశం చేయటం జరిగింది. తదుపరి గ్రామాల్లో చలో హైదరాబాద్ పేరిట వాల్ పెయింటింగ్ చేయాని స్వయంగా ప్రతి కార్యకర్త గోడ పైన వ్రాయించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కార్యకర్తలతో కలసి ఆత్కూరు క్రాస్ రోడ్డులో శ్రీధర్ రెడ్డి స్వయంగా చలో హైదరాబాద్ పేరిట గోడ వ్రాతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధిర టౌన్ మరియు రూరల్ శివరాజు సుమంత్ ,గడ్డం శ్రీహరి చౌదరి , కొమ్మినేని కృష్ణారావు ,జిల్లా నాయకులు జిల్లా కార్యదర్శి రామ్ శెట్టి నాగేశ్వరరావు, ఏలూరి నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, దేవరకొండ కోటేశ్వరరావు, అనుమలు సురేష్ జంపాల రవి, మండల నాయకులు, దుగ్గిదేవర మనికంట మాదిరాజు సాయిరాం, చక్రవర్తులు వరదరాజన్, జడ కృష్ణ, దోర్నాల దినకర్, , కాలసాని రాంబాబు, తంగిరాల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

### చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కొండపల్లి శేఖర్ రెడ్డి

### ప్రభుత్వ ఆదేశాలతో సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**చింతకాని, మే6(మనం న్యూస్):** చింతకాని మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని తిరిగి కొనసాగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు బుధవారం సొసైటీ చైర్మన్‌గా కొండపల్లి శేఖర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో బాధ్యతలు నిర్వహించిన పాలకవర్గాలనే కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆయన తన సభ్యులతో కలిసి కార్యాలయంలో తిరిగి పాలనను ప్రారంభించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ కొండపల్లి శేఖర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు సొసైటీ ద్వారా అందాల్సిన అన్ని సదుపాయాలను సకాలంలో అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సమయంలో రైతులు ఎరువులు,విత్తనాలు లేదా రుణాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు.

## ముత్తారంలో మొక్కజొన్న రాశి దగ్ధం

### పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ



**ముదిగొండ మే 6(మనం న్యూస్)** ముదిగొండ మండలంలోని ముత్తారం గ్రామ పరిసరాల్లో జరిగిన మొక్కజొన్న రాశి దగ్ధ ఘటనపై అధికారులు స్పందించారు. సమీప గ్రామమైన వనంవారి కిష్టాపురానికి చెందిన రైతు షేక్ ఖాసిం కౌలుకు తీసుకున్న ఐదు ఎకరాల్లో పండించిన మొక్కజొన్నను రాశులుగా పోసి ఉంచగా, పక్క పొలాల నుంచి వ్యాపించిన మంటలతో సుమారు 200 క్వింటాళ్ల ధాన్యం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న వెంటనే అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఘటనాస్థలాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని రైతును అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ,జరిగిన నష్టంపై పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సాధ్యమైనంత మేర రైతుకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహిసిల్దార్ రవికుమార్, ఏవో సరిత, ఎంపీ ఓ, కిషోర్, సొసైటీ సీఈవో వీర ప్రసాద్, ఆర్. ఐ కళ్యాణి, జిపిఓ బాలకృష్ణ, ముత్తారం- కిష్టాపురం సెక్రెటరీలు రాంబాబు, శ్రీను, ఏఈఓ రవి, ముత్తారం- కిష్టాపురం సర్పంచులు, లంజపల్లి మమత- పర్ణకోల సరళ దేవి, కొనుగోలు సెంటర్ ఇంచార్జ్ శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు

## బాధ్యతలు చేపట్టిన ఏడు సొసైటీ ఛైర్మన్లు

**ఎర్రుపాలెం, మే 6 (మనం న్యూస్) :** మండలం పరిధిలోని ఏడు సొసైటీ అధ్యక్షుల పదవీకాలం ఇటీవల పూర్తి కావడంతో సొసైటీలకు అధ్యక్షులు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. హైకోర్టు తీర్పుతో రైతులకు మరి కొంతకాలం సేవ చేసే అవకాశం పాత సొసైటీ అధ్యక్షులకు కలిగింది. మండల పరిధిలోని ఎర్రుపాలెం తక్కెళ్ళపాడు, మినవోలు పెద్ద గోపవరం మలుగుమాడు, రాజుపాలెం సొసైటీ చైర్మన్ లు అవులూరి వెంకటేశ్వర రెడ్డి ముల్పూరి శ్రీనివాసరావు శీలం అక్కిరెడ్డి,వెన్నపూస కృష్ణారెడ్డి,శెట్టిపల్లి మదన్ మోహన్ రెడ్డి, కుడుముల మధుసూదన్ రెడ్డిలతో పాటుగా పాలకవర్గ సభ్యులు బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో రైతులకు మరి కొంతకాలం సేవ చేసే భాగ్యం రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ వైస్ చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, గ్రామ పెద్దలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పదో తరగతిలో అత్యధిక మార్కులు రావడం అభినందనీయం..







## గుమ్మా స్ఫూర్తిని అభినందించిన సినీ ప్రముఖులు..

**తల్లాడ, మే 6 (మనం న్యూస్):** పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన గుమ్మా నరేష్, పద్మా దంపతుల కుమార్తె స్ఫూర్తిని పలువురు సినీ రంగ ప్రముఖులు అభినందించారు. హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్ లో దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో స్ఫూర్తిని ప్రముఖ సినీ దర్శకులు బోయపాటి శ్రీను, తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, గుణశేఖర్, రాజా వన్నెంరెడ్డి, ప్రముఖ సినీ హీరోలు సుమన్, మాగంటి మురళీమోహన్, ప్రముఖ హీరోయిన్ లయ, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు అభినందించారు. స్ఫూర్తిని శాలువాలతో సత్కరించి ఆశీస్సులు అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నెల రోజుల్లో పూర్తి వేతనాలు చెల్లిస్తాం : ఛైర్మన్, కమిషనర్

### హామీతో సమ్మెను విరమించిన కల్లూరు మున్సిపల్ కార్మికులు

**కల్లూరు టౌన్ మే 6(మనం న్యూస్):** తమ తొమ్మిది నెలల జీతాలు విడుదల చేయాలని ఈనెల రెండవ తేదీ నుండి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కల్లూరు మున్సిపల్ కార్మికులు ఛైర్మన్, కమిషనర్ హామీతో బుధవారం సమ్మె విరమించారు. ఛైర్మన్, కమిషనర్, మేనేజర్, కొంతమంది కౌన్సిలర్లతో కలిసి సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తోలుత మాట్లాడుతూ కార్మికులు వారి ఇబ్బందుల గురించి, కడుపు ఆకలి గురించి సమ్మె చేశారే తప్ప ఏ రాజకీయ దురుద్దేశంతో చేయలేదన్నారు. కమిషనర్, ఛైర్మన్ల సమక్షంలో జరిగిన చర్చల్లో భాగంగా రెండు రోజుల్లో రెండు నెలల వేతనాలను చెల్లించడంతోపాటు మరో నెల రోజుల్లో పెండింగ్ వేతనాల మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చారని వారు తెలియజేశా. జీతాలతో పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలతో పాటు మూడు జతల యూనిఫాం, చెప్పులు, ఇతర అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఛైర్మన్, కమీషనర్లపై ఉందని అన్న ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నెల రోజుల్లో పూర్తి వేతనాలు చెల్లిస్తాం – ఛైర్మన్ , కమిషనర్ హామీలి రెండు రోజుల్లో రెండు నెలల వేతనాలతో పాటు నెల రోజుల్లో పెండింగ్లో ఉన్న పూర్తి వేతనాలను చెల్లించటానికి సన్న హాల్ చేసినట్లు ఛైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ రాజశేఖర్లు కార్మికులకు హామీ ఇచ్చారు . సమ్మె శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా కార్మిక నాయకులు తెలియజేసిన మూడు జతల యూనిఫామ్, చెప్పులు, నాలుగు రోజుల వేతనంతో పాటు మిగిలిన అన్ని బకాయిలను చెల్లిస్తామని వారు హామీ ఇచ్చారు.

**నెల రోజుల్లో చెల్లించకపోతే మరలాసమ్మె చేస్తాం**



**ఏఐటియుసి నాయకులు.**

నెల రోజుల్లో పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లిస్తామని కమిషనర్, మున్సిపల్ ఛైర్మన్ లు సంయుక్తంగా ఇచ్చిన హామీ మేరకు ఈరోజు సమ్మె విరమిస్తున్నామని మరో నెల రోజుల్లో మాకు ఇచ్చిన హామీ నెరవేర్చని యెడల మరలా నిరవధిక సమ్మెను చేస్తామని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) కల్లూరు మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓడల కృష్ణమూర్తి, సయ్యద్ వజీర్ మియా లు తెలియజేశారు. లిఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా నాయకులు తడికమల్ల యోబు కుమార్ ,మేనేజర్ నందు శెట్టి నాగేశ్వరరావు,కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు , దాసరి సుధారాణి, భూక్య రాంబాయి,గుండ్ల పుల్లారావు ,యూనియన్ నాయకులు, ఉపాధ్యక్షులు చింతపల్లి శ్రీను, గొల్లమందల యశోద,కే అంజలి, సహాయ కార్యదర్శులు మణిరాజ్, చిన్న, సుధాకర్, కోశాధికారి కంభంపాటి ప్రకాష్, కట్ట నరసింహారావు, బాబుగౌడ్, ప్రవీణ్, రాంబాబు, లక్ష్మి , జగతి, కే మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మనం



# సత్తుపల్లి

సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ

## ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసిన భద్రరాజు

**తల్లాడ, మే 6 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని తల్లాడ బస్టాండ్ లో బుధవారం మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ ధూపాటి భద్రరాజు తన తల్లిదండ్రులు (ధూపాటి. వెంకట రాజు– తులసమ్మ) జ్ఞాపకార్థం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సుమారుగా 500 మంది ప్రయానికులకు ఈ ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృశ్య ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని, తల్లాడ బస్టాండ్ కంట్రోలర్ లాలయ్య ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయాలని తీసుకున్న ఈ నిర్ణయం కి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్ లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఎర్రుపాలెం, మే 6 (మనం న్యూస్) :** ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరకు తమ ధాన్యాన్ని విక్రయించాలని రాజుపాలెం సొసైటీ ఛైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి రైతులకు సూచించారు వెంకటాపురంలో రాజుపాలెం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళు నిర్వహిస్తామని తెలిపారు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓలు బొగ్గుల శివారెడ్డి మోహన్‌రావు నాయకులు బొగ్గుల శ్రీనివాసరెడ్డి కర్నాటి రామకోటారెడ్డి కోగంటి నాగేశ్వరావు శీలం వెంకట్రామిరెడ్డి కోగంటి సత్యనారాయణ వెన్నపూస వెంకటరెడ్డి కర్నాటి సుధాకరరెడ్డి వేముల వెంకటేశ్వరావు నాగిరెడ్డి,అప్పారావు వెంకటనారాయణ తిరుమలరెడ్డి సొసైటీ సభ్యులు అధికారులు రైతులు పాల్గొన్నారు



## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం : వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి, మే06 (మనం న్యూస్) :** సింగరేణి మండలంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతుల ప్రయోజనం కోసమే ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ స్పష్టం చేశారు.మండల పరిధిలోని అప్పాయిగూడెం రైతు వేదికలో విశాల సహకార పరపతి సంఘం,రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నివేదిక కార్యక్రమాన్ని సొసైటీ ఛైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ సింగరేణి మండలంలో అత్యధికంగా మొక్కజొన్న సాగు చేశారని, ఈ క్రమంలో మంత్రులు,అధికారులతో కొట్లాడి మరీ రైతుల ప్రయోజనం కోసం మొక్కజొన్న కొలుగోలు కేంద్రాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు.ఇతర జిల్లాలకు మొక్కజోన్న పంట రవాణా చేయడం ఇబ్బందిగా మారడంతో,నిరుపయోగంగా ఉన్న అప్పాయిగూడెం గోదాంను తెరిపించి ట్రాక్టర్ల ద్వారా గోదాంకు తరలించే ఏర్పాటు చేశామన్నారు.ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా వ్యవసాయశాఖ,



సొసైటీ అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో పని చేయాలని సూచించారు.బ్యాంకులను వినియోగించుకోని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సక్రమంగా రెన్యూవల్ చేసుకోని ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు.అధికారులు సూచించినట్లు పంటల మార్పిడి చేసుకోవాలని,పామాయిల్ పంటను వేసుకోవాలన్నారు.అధికారుల పనితీరుతోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. రైతు రుణమాఫీ 85 శాతం పూర్తి అయిందని,సాంకేతిక కారణాలతో 15 శాతం పూర్తి కాలేదన్నారు.బ్యాంకర్లు రైతులకు,డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణిలో ఇబ్బందులు సృష్టించవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు,ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ,అసిస్టెంట్ రిజిస్ట్రార్ గుడివాడ మేరి,ఏవో బీ.అశోక్‌కుమార్,సర్పంచ్‌లు దండు ప్రవీణ్,దారావత్ హేమలతబాలాజీ,బానోత్ హీరాలాల్,దారావత్ మంగీలాల్,సొసైటీ డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య,కొత్తూరి రామారావు,మర్సకట్ల రోషయ్య, డేగల ఉపేందర్,బ్యాంకు మేనేజర్లు బాల రవికుమార్, బొల్లు హనుమంతరావు, తోటకూరి రాము,రవీందర్ నాయక్,కొంగర వేణు,వివిధ శాఖల ఏఈలు వెంకన్న,నాగయ్య,రాజశేఖర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు

# మనం కొత్తగూడెం



కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

## "ప్రజల కోసం... ప్రజల మధ్య... ప్రజల నాయకుడు : మూడ్ గణేష్

**కొత్తగూడెం టౌన్ మే 6 (మనం న్యూస్) :** 11వ డివిజన్ ప్రజల తరఫున మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియంజేస్తున్నాము. మా డివిజన్‌లో చాలాకాలంగా ఉన్న తాగునీటి సమస్యను మీరు ప్రత్యేక చొరవ తీసుకుని వేగంగా పరిష్కరించడం ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించింది. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి వెంటనే స్పందించే నాయకత్వం చాలా అరుదు. అలాంటి ప్రజాహిత దృక్పథంతో పనిచేస్తున్న మేయర్ మూడ్ గణేష్ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. మీ సేవా భావం, ప్రజల పట్ల మీ అంకితభావం ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ, 11వ డివిజన్ ప్రజలందరి తరఫున మరోసారి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.



## అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా అరెస్ట్

**– 71.795 కేజీల గంజాయి స్వాధీనం -- నలుగురు నిందితులు రిమాండ్**



**కొత్తగూడెం క్రైమ్, మే 6, (మనం న్యూస్):** కొత్తగూడెం 1టౌన్ సీఐ కరుణాకర్ ఆదేశాల మేరకు ఎస్ఐ రాకేష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పాత కొత్తగూడెం సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ౧+ 30 2274 నంబర్ గల ఎర్టిగా కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని తనిఖీ చేశారు.తనిఖీలలో వాహనంలో సుమారు 71.795 కేజీల గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.35,98,750 ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులు ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.దీంతో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.నిందితుల వివరాలు:మొహమ్మద్ అజాజ్ అహ్మద్ (45), తండ్రి అబ్దుల్ లాతీఫ్‌కొలి అరుణ్ (29), తండ్రి రాజు రంగాల రాజారామ్ (25), తండ్రి పండుగోగుల సతీష్ (32), తండ్రి వెంకన్న

## సూపర్ బజార్ సెంటర్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు

***– త్రీ టౌన్ ఎస్ఐ విజయకుమారి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు***

**కొత్తగూడెం క్రైమ్ , మే 6 , (మనం న్యూస్ ) :** పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్ వద్ద త్రీ టౌన్ ఎస్ఐ విజయకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు, నెంబర్ ప్లేట్లను పరిశీలించారు. అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలు మరియు వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి డ్రగ్స్ తనిఖీలు కూడా చేపట్టారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ గారు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,"ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. హెల్మెట్ ధరించడం, సరైన పత్రాలు వెంట ఉంచుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు" అని తెలిపారు.ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి

## నిత్యావసర భారాలు మోపుతున్న కేంద్రం

**– ధరల నివారణకు చర్యలు చేపట్టాలి**
**– ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి**
**– కార్పొరేట్ శక్తుల దోపిడీని అరికట్టాలి**
**– ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేస్తాం**
**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
**– సిపిఐ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో ప్లకార్డులు, ఖాళీ సీలిండర్లతో ధర్నా**



**కొత్తగూడెం టౌన్ మే 6 (మనం న్యూస్ ):** కొత్తగూడెం : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశప్రజలకోసం కాకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుండంవల్లే సామాన్య ప్రజలపై నిత్యావసర భారాలు విపరీతంగా పెరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా కూనంనేని మాట్లాడుతూ ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలతో సామాన్యుడి వంటిల్లు మండుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిత్యావసరాల ధరల నివారణకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టకుండా, కార్పొరేట్ శక్తుల దోపిడీకి ఎర్రటి తివాచీ పరుస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థను అటకెక్కించి పేదల నోటికాడ కూడును లాగేస్తున్నారని, వెంటనే పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఇంధన కొరతపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికే లేదని, ఇప్పటికైనా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సామాన్యుడి గొంతుకై నిలబడతామని, ఈ పోరాటాలను గ్రామ గ్రామానికి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, ఎస్ కె ఫహీమ్, దీటి లక్ష్మీపతి, కె రత్నకుమారి, మునిగడప పద్మ, కార్పొరేటర్లు, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## కనీస వేతనం కోసం ఉద్యమించాలి

**– సింగరేణి రిటైర్డ్ జిఎం మేకల కనకయ్య**
**– హక్కుల పరిరక్షణ కోసం కార్మికులు చైతన్యవంతంతో ముందుకు సాగాలి**
**– సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి**



**కొత్తగూడెం సింగరేణి, మే6(మనం న్యూస్):** కనీస వేతనం కోసం కార్మికులంతా ఏకమై ఉద్యమించాలని సింగరేణి రిటైర్డ్ జిఎం మేకల కనకయ్య అన్నారు. సిఐటియు కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక ఉత్సవ్ నిర్వహణలో భాగంగా ప్రగతినగర్ బస్తి సెంటర్ నందు బుధవారం మేడే వారోత్సవాలు ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా సింగరేణి రిటైర్డ్ జిఎం మేకల కనకయ్య పాల్గొని మాట్లాడుతూ మే డే వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న కార్మిక వర్గానికి సహకరిస్తున్న ప్రజానీకానికి అభినందనలు తెలిపారు. కనీస వేతనాలు అమలు కోసం మహిళా కార్మికులు పురుష కార్మికులు కలిసి ఐక్యంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని అన్నారు. కంపెనీలలో పని ప్రాంతాల్లో పనిచేస్తున్న మహిళలు కార్మికులు ఒకే పని చేస్తున్నప్పటికీ రెండు రకాల వేతనాలు ఉంటున్నాయని ఈ వ్యత్యాసం వల్ల కుటుంబం పోషణ చాలా కష్టంగా మారుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం సరైనది కాదన్నారు. కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను కొనసాగించాలని కనీస వేతనం సాధించేంతవరకు విశ్రమించకుండా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. హక్కుల పరిరక్షణ కోసం కార్మికులు చైతన్యవంతంతో ఉద్యమాలు ఉధృతంగా నిర్మించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్ లను బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే విధంగా కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పద్ధతికి వ్యతిరేకంగా కార్మికులు ప్రజలు కలిసి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు . స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో మేడే అమరవీరుల త్యాగాల ఫలితంగా వచ్చిన 28 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నూతనంగా కార్మికులకు వ్యతిరేకంగా హక్కులను భక్షించే పద్ధతిలో బిజెపి మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులపై పెను భారాన్ని మోపుతూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత కార్మిక వర్గంపై పెత్తనం చెలాయించాలని కార్మికుల శ్రమను దోచుకొని పెట్టుబడిదారులకు, బడా యాజమాన్యాలకు ఊడిగం చేస్తూ అధికార దాహంతో తను ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్న బిజెపి మతోన్మాద విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. కార్మికులు కష్టించి పనిచేసే భారత దేశ ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి కార్మిక వ్యతిరేక విధానాలపై చైతన్యవంతమైన ఉద్యమాలు నిర్మించాలని సిఐటియు పిలుపునిస్తుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటం చేస్తున్నప్పుడు ప్రజలు వెన్నంటే ఉండి కార్మికులకు అండగా నిలబడాలని వారి పోరాటాలకు సంపూర్ణ మద్దతు తెలియజేసి కార్మికులు కర్షకులు ఐక్యంగా బిజెపి చేస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను మతోన్మాద విధానాలను అర్థం చేసుకొని చైతన్యవంతంగా ముందుకు అడుగులు వేయాలని కార్మిక వర్గాన్ని రక్షించి భారతదేశాన్ని కాపాడాలని కార్మికులకు ప్రజలకు పిలుపునిచ్చారు. వాడవాడల మేడే అమరవీరుల త్యాగాలను వారి ఔన్నత్యాన్ని ప్రస్తుత మార్గదర్శకాన్ని వివరించడానికి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను కర్షకులను చైతన్యం చేస్తూ కార్మిక ఉత్సవ్ పేరుతో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకి సిఐటియు పట్టణ కన్వీనర్ భూక్యా రమేష్ సభకు అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు లిక్కి, బాలరాజు అంబాల దుర్గమ్మ, కే.శైలజ, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు మందా నాగకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సమ్మయ్యా, రాజారావు, సిఐటియు నాయకులు ఆలేటి శ్రీనివాస్, మహ్మద్ జలాల్, భూక్యభద్రు, సిద్ధల రాములు, నరసింహారావు, అనిల్ పాల్గొన్నారు.

# 24/7 తెరిచే ఉంటాయి..!

- అర్థరాత్రిలైన బెల్ట్ లో మద్యం పుష్కలం
- బెల్టు షాపులకు కల్తీ మద్యం..?
- సిండికేట్ ఆదేశాలతో బెల్టు షాపుల నిర్వహణ
- అన్నీ తెలిసినా మౌనం వహిస్తున్న అబ్కారి శాఖ
- అధిక ధరలతో మందుబాబుల జేబులకు చిల్లు





**లక్ష్మీదేవిపల్లి మే 06 (మనంన్యూస్):** ప్రస్తుతం ఏ ఊరికి వెళ్ళినా... ఏ వాడకు వెళ్ళినా... ఏ వీధికి వెళ్ళినా... బడి, గుడి కనపడకపోవచ్చు కానీ పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు మాత్రం దర్శనమిస్తున్నాయి. జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా బెల్ట్ షాపులు 24 గంటలు... వారమంతా తెరిచి ఉండడం... అదేవిధంగా ఎన్నికల సమయంలో... మహనీయుల జయంతి.. వర్ధంతి సందర్భంగా... అబ్కారి శాఖ వైన్ షాపులను మూసి వేయించిన కానీ బెల్ట్ షాపులు మాత్రం తెరిచే ఉంటున్నాయి. 24 గంటలు బెల్ట్ షాపుల్లో మద్యం పుష్కలంగా లభించడంతో మందుబాబులు కూడా మితిమీరి మద్యం సేవిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ షాపులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల నుండి ఏ ఒత్తిడిలో లేకుండా సిండికేట్ వ్యాపారులు వారికి అండదండగా నిలవడంతోనే ప్రతి గల్లీలో పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు వెలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దీనికి తోడు ధరలు కూడా పెంచి విక్రయిస్తుండడంతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతోందని పలువురు ఆపుతున్నారు ఇవన్నీ తెలిసినా కానీ అడ్డుకోవాల్సిన ఆప్కారి శాఖ మౌనం వహించడమేనక ఆంతరమేంటని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**బెల్టు షాపులకు కల్తీ మద్యం..?**

మద్యం సిండికేట్ వ్యాపారులు తమ కార్యాలయాలు వేదికగా నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. స్టాక్ పాయింట్ల నుంచి తమ వద్దకు వచ్చిన మద్యం సీసాల మూతలు తీసి అందులో స్పిరిట్ కలిపేందుకు ప్రత్యేక ముఠాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో మూతకు పది రూపాయలు చెల్లిస్తూ కొంతమందిని కల్తీ మద్యం తయారు చేయడానికి వాడుకుంటున్నట్లు చర్చించుకోవడం గమనార్హం. ఇలా తయారుచేసిన కల్తిమధ్యాన్ని ఏకంగ వైన్ షాపుల్లో అమ్మకుండా బెల్ట్ షాపులకు తరలిస్తున్నారని మందుబాబులు మాట్లాడుకోవడం గమనించాల్సిన విషయం. వైన్ షాపుల్లో కల్తి మద్యం దొరికితే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో బెల్ట్ షాపులకు తరలించడం దానికి తోడు బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తుండడంతో తాము స్పిరిట్ కలిపేందుకు వెచ్చించిన వ్యయం మొత్తం బెల్ట్ షాపుల ద్వారా తమకు ఈజీగా వచ్చేస్తుందని భావించి ఇలా మద్యం దగాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**కృత్రిమ కొరతతో నిలువు దోపిడీ...**

వైన్స్ షాపుల్లో వినియోగదారులు అడిగే పాపులర్ బ్రాండ్లు ముఖ్యంగా కేఎఫ్ లైట్ బీర్ మెన్షన్ హౌస్ స్టాక్ లేదని, ఇంకా ఇతర బ్రాండ్ మందులు లేవని యజమానులు చెప్తూ కృత్రిమ కొరత సృష్టిసున్నారని తెలుస్తోంది.ఇదే బ్రాండ్ మందు బెల్టు షాపుల్లో పుష్కలంగా దొరుకుతుందని, అక్కడ మాత్రం ధరలు పెంచి అమ్ముతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. లోపాయికారిగా ఆ స్టాక్ను బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. సిండికేట్ మాయాజాలంతో వైన్స్ 180 ఉండాల్సిన మద్యం, బెల్ట్ షాపుల్లో 250 కి విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అదనపు వసూళ్లతో ఒక్కో బాటిల్ పై 120 నుండి 140 వరకు అదనంగా దండుకుంటూ సామాన్య కూలీల శ్రమను దోచుకుంటున్నారు.

**అర్ధరాత్రిలైన బెల్ట్ లో మద్యం పుష్కలం...**

మండలంలో మద్యం మాఫియా పడగవిప్పుతోంది. నిబంధనలు గాలికి ఎగిరిపోతుంటే, బెల్ట్ షాపులు ఊరూరా సామ్రాజ్యాలుగా విస్తరిస్తున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రం మొదలుకొని మారుమూల పల్లెల వరకు 'బెల్ట్' దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సిన మద్యం దుకాణాల కంటే ముందే, తెల్లవారుజామున 4:30 గంటలకే బెల్ట్ షాపులు వినియోగదారులకు 'స్వాగతం' పలుకుతుండటం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా మారుతోంది. తమ సంపాదనంతా మద్యం పాలవ్వడంతో పల్లెల్లో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంకో విషయం ఏంటంటే మండలంలోని నడి సెంటర్ లో దర్జాగా పాన్ షాప్ పేరుతో బెల్ట్ షాప్ ని నడిపించడం చూస్తుంటే అధికారుల ఎంతరహాలో సహకరిస్తున్నారనేది గమనించాలి.

**అన్నీ తెలిసినా మౌనం వహిస్తున్న అబ్కారి శాఖ**

ఆప్కారి షాపులో పనిచేసే అధికారికి బెల్ట్ షాపులు గురించి తెలియకపోవడం ఏంటని అసలు బెల్ట్ షాపులను పెంచి పోషించే అధికారులకే వాటి గురించి తెలియకపోవడం ఏంటంటూ మండల ప్రజలు చర్చించుకోవడం గమనారహం. అధికారులే వెనుదనుగా నిలిచి ఈ అక్రమ సామ్రాజ్య విస్తరణకు తోడ్పాటు అందిస్తుంటే తమకేమీ తెలియదని బుఖాయించడం సరికాదంటూ ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై రైడ్ చేసి మోపించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యానగర్ కాలనీలో శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి



**చుంచుపల్లి,మే 6(మనం న్యూస్) :** విద్యానగర్ కాలనీలో శానిటేషన్ పనులను సర్పంచ్ శాంతి శ్రీ మరియు వార్డు మెంబర్ జకరయ్య స్వయంగా పరిశీలించారు. కాలనీలోని వీధులు, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త సేకరణ విధానాలను సమీక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి శ్రీ మాట్లాడుతూ, గ్రామంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రతి ఇంటి వద్ద నుంచి చెత్తను సమయానికి సేకరించి, కాలనీలో ఎక్కడా మురికి పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు.వార్డు మెంబర్ జకరయ్య మాట్లాడుతూ, ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. చెత్తను రోడ్లపై వేయకుండా, నిర్ణీత ప్రదేశాల్లో వేయాలని సూచించారు.

స్థానికులు ఈ పరిశీలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.

ONE FAMILY. ONE VISION. ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL

# కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి - సుజాతనగర్

## తమిళ దళపతి విజయ్ విజయం చారిత్రాత్మకం

### -- స్ఫూర్తిదాయకం : ఆచార్య డా. మద్దెల శివకుమార్



**చుంచుపల్లి, మే 6(మనం న్యూస్) :** తమిళనాడు రాజకీయాల్లో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ సాధించిన ఎన్నికల విజయం చారిత్రాత్మకమైందని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అభిప్రాయపడ్డారు.పార్టీని స్థాపించి రెండున్నర సంవత్సరాలు కూడా పూర్తికాకముందే, ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేసి, దశాబ్దాలుగా అధికారాన్ని అనుభవిస్తున్న ప్రధాన పార్టీలకు సవాల్ విసరడం సాధారణ విషయం కాదన్నారు. ఎన్నో అడ్డంకులు, అవరోధాలు, కేసులు ఎదురైనా, మొక్కవోని ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగిన నాయకత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించిందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీలు--- పాత రాజకీయాలపై విసుగు చెంది, మార్పు కోసం ముందుకు వచ్చి ఈ విజయానికి కారణమయ్యారని అన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఈ విజయాన్ని దేశవ్యాప్తంగా స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, విజయ్ నాయకత్వంలో మంచి కేబినెట్‌ను ఏర్పాటు చేసి, ఎన్నికల హామీలను అమలు చేస్తూ, సమగ్ర ప్రజాస్వామ్య పరిపాలన అందించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, రాష్ట్ర కార్యదర్శులు పృథ్వీరాజ్, బొమ్మెర అశోక్, మద్దెల ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

## ధరల భారంతో సామాన్యుడు నలుగుతున్నాడు...

### – సుజాతనగర్‌లో సిపిఐ భారీ ధర్నా




**సుజాతనగర్, మే 6 ( మనంన్యూస్) :** సుజాతనగర్ మండల కేంద్రంలో సామాన్య ప్రజల సమస్యలపై సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్––డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యుడి జీవితం కష్టసాధ్యంగా మారిందని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామాన్యుడి జీతాలు, కూలీల రోజువారీ వేతనాలు పెరగకపోవడం వల్ల కుటుంబ ఖర్చులు నిర్వహించడమే భారంగా మారిందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో గృహిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇంధన కొరత కారణంగా వాహనదారులు, రైతులు, ఆటో డ్రైవర్లు రోజువారీ పనులు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సుజాతనగర్ మెయిన్ రోడ్డుపై నిర్వహించిన ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, నిత్యవసర సరుకుల సరఫరాలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతను తక్షణమే నివారించి ప్రజలకు సక్రమంగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అలాగే ధరల నియంత్రణపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల**

**- జగన్నాథపురం రైతు వేదికలో రైతు సంక్షేమ సదస్సు**



**పాల్వంచ, మే 6(మనం న్యూస్):** రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నది. పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాథపురం రైతు వేదికలో పాల్వంచ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సంక్షేమ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ..

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రైతులకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. రైతు రుణమాఫీ, ఎకరానికి రెండు దఫాలుగా 12 వేల రూపాయలు రైతు భరోసా, రైతు భీమా, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర తోపాటు సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్, రైతు వేదికలో రైతులకు శాస్త్రవేత్తల ద్వారా పంటల మెళుకువలు శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. రైతు సహకార వారోత్సవాలలో రైతులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూ రావు, హార్టికల్చర్ ఆఫీసర్ కిషోర్, లేబర్ ఆఫీసర్ రాజు, డీసీసీబీ మేనేజర్ స్వప్న, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజా ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం జయశ్రీ, మండల వ్యవసాయ శాఖాధికారి పి శంభో శంకర్, సొసైటీ సీఈఓ జి లక్ష్మి నారాయణ, సొసైటీ డైరెక్టర్లు జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ భూక్యా శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, గంధం చిన రామయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సంజయ్ నగర్‌లో అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట



**పాల్వంచ, మే 6(మనం న్యూస్):** పట్టణ పరిది సంజయ్ నగర్ లో అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం బుధవారం జరిగింది. గత వారం రోజులుగా రామాలయం నందు ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా చేపట్టారు. బ్రహ్మశ్రీ ఆదినారాయణ స్వామి ఆధ్వర్యంలో వేద మంత్ర ఉపచారాలతో కలశ పూజలు, వాస్తు దోష నివారణ పూజలు, ఊరి పొలిమేరలో కొర్లు నాటుట, గ్రామ పొలిమేర బలిహరణాలు, పూజా కార్యక్రమాలు, మహిళలకు కుంకుమ పూజలు, మంగళ గౌరీ పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం జరిగిన బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ ధర్మసొత్ నరేష్, 44 వ డివిజన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు తో పాటు గ్రామ పెద్దలు సిద్దెల హుసేన్, ఉబ్బపల్లి దావీదు, తేలూరు వెంకటేశ్వర్లు, దాసరి యాకయ్య, చీరాల మధు, గురవయ్య, దేబ్బెందల రమేష్, గార్లపాటి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని ఉన్నత చదువులకు అడుసుమల్లి ఆర్థిక చేయూత

**- మాచినపల్లిరాము జ్ఞాపకార్థంగా 10 వేల నగదు సాయం**

**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా చేతుల మీదుగా అందజేత**



**పాల్వంచ, మే 6(మనం న్యూస్):** ఉన్నత చదువులకు పేద విద్యార్థులు దూరం కాకూడదన్న లక్షంతో సీపీఐ పట్టణ కార్యదర్శి, పెద్దమ్మ గుడి ధర్మకర్త అడుసుమల్లి సాయిబాబు విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులను మాచినపల్లి రాము జ్ఞాపకార్థంగా ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి యస్ కె సాబీర్ పాషా అన్నారు. బుధవారం పట్టణ పరిధి రామ్ నగర్ ప్రాంతానికి చెందిన బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న తిరుమలరావు పేద విద్యార్థి కావడంతో.. చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి, సాబీర్ పాషా చేతుల మీదుగా విద్యార్థి తల్లిదండ్రులకు 10 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. అడుసుమల్లి సాయిబాబు అనేకమంది పేద విద్యార్థులకు సాయం చేయడం గొప్ప విషయం అన్నారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని నాలుగు సంవత్సరాలకు గాను ప్రతి సంవత్సరం పదివేల రూపాయలు సహాయం అందజేయడం చాలా సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా సాయిబాబును ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా సాయిబాబా ను సాబీర్ పాషా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి విసంశెట్టి పూర్ణ చంద్రరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, ఎఐటియుసి నాయకులు నరాటి ప్రసాద్, జమలయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి

**- వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి**

**- నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి**

**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల**




**పాల్వంచ, మే 6(మనం న్యూస్):** ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు విపరీతంగా పెరిగిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సిపిఐ పాల్వంచ మండల, పట్టణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ వద్ద నుండి ప్రదర్శనగా అంబేద్కర్ సెంటర్ చేరుకొని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య మానవుడిపై ఆర్థిక భారం విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇంధన ధరలను నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, దీని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడి పేద, మధ్యతరగతి ప్రజల బతుకు భారంగా మారుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించకుంటే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను అటకెక్కించి పేదల నోటికాడ కూడును లాగేస్తున్నారని, వెంటనే పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. వరి, మొక్కజొన్న పంటలు తక్షణమే ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సరిపడా బస్తాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు, 44వ డివిజన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న, జకరయ్య, గొర్ల నరేష్, పునుకుల సర్పంచ్ వజాజ కృష్ణవేణి, నాగారం కాలనీ సర్పంచ్ తేజవత్ వినోద్, గౌతమి కృష్ణ, యాకయ్య, వేములపల్లి శ్రీనివాసరావు, కోటి తిరుపతయ్య, ప్రేమ, మేక రాంబాబు, గుగులోత్ రాములు, వాడే లక్ష్మి, పుష్ప వజ్జా రాజేశ్వరి, వజ్జా లక్ష్మి, ఆదిలక్ష్మి, గడల తిరుపతమ్మ, కమటం ఈశ్వరమ్మ, సమ్మక్క, వెంకటమ్మ, అల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, సంజీవరావు, ఎస్కే కరీం, కోమటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పనుల్లో అప్రమత్తత అవసరం : డీఈ నందయ్య

**- అవగాహనతో పనులు చేపట్టాలి**

**- డివిజినల్ సిబ్బందికి అవగాహన**



**పాల్వంచ, మే 6(మనం న్యూస్):** పనుల నిర్వహణలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ.. విధి నిర్వహణ చేపట్టాలని పాల్వంచ డివిజనల్ ఇంజనీర్ ( ట్రాన్స్కో ) ఎన్ వీ నందయ్య పేర్కొన్నారు. సబ్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో రక్షణ వారోత్సవాల సందర్భంగా ఆఫీస్ మరియు మెయింటెనెన్స్ సిబ్బందికీ అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహిస్తూ.. డిప్యూటీ ఇంజనీర్ నందయ్య మాట్లాడారు. ప్రతిరోజూ పనుల్లో సేఫ్టీ కి అత్యంత ప్రాధాన్యత నిస్తూ.. ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా పనులు నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిబ్బందికి సేఫ్టీ పై అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు ఎలా జరుగుతాయి. ఏయే పరికరాలు ఎలా ఉపయోగించాలి. ప్రమాదాలు ఎలా నివారించాలి. ఒక వేళ ప్రమాదం జరిగితే ఎటువంటి అత్యవసర ప్రథమ చికిత్స చేయాలి, ప్రాణాలు పోకుండా ఎలా కాపాడాలనే విషయాలపై చర్చించారు. సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. సమావేశంలో పాల్వంచ ఏ డీ ఈ ఎం డి రహీముల్ హుస్సేన్, టౌన్ 1, టౌన్2, రూరల్, ములకలపల్లి సెక్షన్ ల ఏఈ లు, సబ్ ఇంజనీర్, ఫోర్మెన్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్, లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మనం



# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

# దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో చోరీ

- సోమవారం 4 తేదీన ప్రజా దర్బార్ లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన 9 మంది వార్డు సభ్యులు.
- ముఖ్యమైన రికార్డులు అపహరణ
- చోరీ వెనుక ఎవరి హస్తం...???
- కంప్యూటర్ డేటా ఎవరికి అవసరం...???



**దమ్మపేట, మే 06 (మనం న్యూస్ ) :** దమ్మపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం మరోసారి జిల్లాలో చర్చినియాసంగా మారింది. కార్యాలయం తాళాలు తీసి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు కార్యదర్శి గదిలోని బీరువా పగలగొట్టి అత్యంత కీలకమైన రికార్డులు ఎత్తుకెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటనపై పంచాయితీ కార్యదర్శి బి అనంత కుమార్,పోలీసులకు ఫిర్యాదు చేశారు.మంగళవారం సాయంత్రం సమయంలో యధావిధిగా సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లారు. సిబ్బంది సౌకర్యార్థం తాళాలు కార్యాలయ ఆవరణలో నే ఒక రహస్య ప్రదేశంలో ఉంచ టం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది.పంచాయతీ కార్యాల యానికి వచ్చి చూడగా కార్యదర్శి అనంత కుమార్, గది తాళం తీసి ఉండటం గమనించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి కి తెలపగా ఆయన వచ్చి చూసి రికార్డులు మాయమైనట్టు గుర్తించారు.




**చోరీకి గురైన రికార్డులు ఎవరికి అవసరం**

దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో చోరీకి గురైన రికార్డులు ఇవేనని తెలుస్తుంది. (2024)(25 26) సంవత్సరాల సంబంధించిన గ్రామ సభ తీర్మాన రిజిస్టర్లు ఇంటి పన్ను పుస్తకాలు ఎంబి బుక్కుల( 2020)నుండి (20 25) వరకు సంబంధించిన సిబ్బంది హాజరు రిజిస్టర్ 2024 -26 కాలానికి సంబంధించిన నగదు పుస్తకాలు.బిల్లులు విశేషమేమిటంటే కేవలం రికార్డులను తీసుకెళ్లడమే కాకుండా కార్యాల యంలోని కంప్యూటర్లో ఉన్న కీలకమైన ఫైళ్ళను కూడా నిందితులు డిలీట్ చేసినట్టు కార్యదర్శి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వార్డు సభ్యుల ఆందోళన అంతా కావాలని చేసినట్టు ఉంది

ఈ దొంగతనం జరిగిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం రోజే గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కార్యదర్శిని కలిసి పలు రికార్డులు వివరాలు కావాలని కోరారు. ఆ మరుసటి రోజే ఉదయం 10 గంటల అత్యవసర సమావేశం జరగాల్సి ఉండగా ఈ చోరీ జరగడం పలు అనుమా నాలకు తావిస్తోంది. పంచాయతీకి సంబంధించిన కీలక రికార్డులే ఇప్పుడు మాయం అవ్వడం వెనక పెద్దల హస్తం ఉందేమోనని వార్డు సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.రికార్డులు మాయం చేసి తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతుందని వారు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి,కార్యాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ప్రతిసారి ఏదో వివాదంతో వార్తలోకి ఎక్కే దమ్మపేట గ్రామపంచాయతీ తాజా రికార్డులు మాయంతో మండలంలో తీవ్ర కలకలం రేగింది.

# దమ్మపేట పంచాయతీలో దొంగల తెలివి.. ఆధారాల మాయానికే ఈ డ్రామా

- బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు డిమాండ్
- విలువైన సామాగ్రి వదిలేసి,పాత రికార్డుల అపహరణ
- కంప్యూటర్‌లో కీలక డేటా సైతం డిలీట్
- నిన్న రికార్డులు అడిగితే నేడు చోరీ జరగడంపై అనుమానాలు
- ఆఫీసు ఆవరణలోనే తాళాలు పెట్టిన సిబ్బంది తీరుపై అనుమానం






**దమ్మపేట, మే 06 (మనం న్యూస్) :** దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో చోరీకి గురైన వస్తువులను గమనిస్తే ఇది పక్కా ఆధారాల ధ్వంసమేనని అర్థమవుతోందని దొంగలెవరైనా ఆఫీసులో చొరబడితే లక్షలు విలువ చేసే కంప్యూటర్లు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఎత్తుకెళ్తారు.కానీ ఇక్కడ దొంగలు వాటిని వదిలేసి.బీరువాలోని 2024-26 తీర్మాన రిజిస్టర్లు,మస్టర్ రోల్స్, ఎంబీ బుక్స్,హౌజ్ టాక్స్ పుస్తకాలు,నగదు బిల్లులనే ఎత్తుకెళ్లారా అంతేకాకుండా ఆఫీసులోని కంప్యూటర్ ఆన్ చేసి అందులో ఉన్న సాఫ్ట్ కాపీలను (ఫైళ్లను) కూడా డిలీట్ చేయడం.ఇది ఇంటి దొంగల పని అని.లావాదేవీల గుట్టు తెలిసిన వారు తప్ప,సాధారణ దొంగలు సిస్టమ్‌లో ఫైళ్లు వెతికి మరీ డిలీట్ చేయడం అసాధ్యమని బిఆర్ఎస్ నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆరోపించారు. ప్రభుత్వ రికార్డులు భద్రపరిచే కార్యాలయానికి సాయంత్రం తాళం వేసిన తర్వాత.సిబ్బంది సౌకర్యార్థం ఆ తాళాలను ఆవరణలోనే ఒక 'రహస్య ప్రదేశంలో' దాచివెళ్లడం ఆనవాయితీగా వస్తోందని చెప్పడంవిడ్డూరంగా ఉందని శ్రీనివాసరావు, అన్నారు.ఇంతటి నిర్లక్ష్యంగా తాళాలు బయటపెట్టి, దొంగలకు సులువుగా ఆహ్వానం పలికినట్లుగా అధికారుల తీరు ఉందని శ్రీనివాసరావు విమర్శించారు. కార్యదర్శిని సస్పెండ్ చేయాలనీ ఈ చోరీ వ్యవహారంపై ఆధారాల మాయానికి పరోక్షంగా కారణమైన కార్యదర్శి అనంత్ కుమార్‌పై వేటు వేయాలని యార్లగడ్డ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయనను తక్షణమే సస్పెండ్ చేయడంతో పాటు,ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగిన చర్య తీసుకోవాలని టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నాయకుడు యార్లగడ్డ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

# యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలి





**దమ్మపేట, మే 06 (మనం న్యూస్) :** పట్వారిగూడెంలో రైతు ముంగిట్లో శాత్రవేత్తలు శిక్షణా కార్యక్రమాన్ని వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఇంచార్జి శాస్త్రవేత్తలైన డా బి జాంబమ్మ ,డా ఆర్. శ్రీనివాస రావు, నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డా ఆర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని, సాగు ఖర్చులను తగ్గించుకో వాలని, భూసారాన్ని పెంచుకోవా లని,అవసరం మేరకు రసాయనా లను వాడాలని,సేంద్రియ వ్యవసా యం చేసుకోవాలని, నీటి వినియో గాన్ని పెంచుతూ నీటి ఆదా చేప ట్టాలని సూచించారు.అదే విధంగా పంట మార్పిడి పద్ధతులను చేపట్టి సుస్థిర ఆదాయాన్ని పొందాలని. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాలను మాత్రమే సాగుచేయా లని సూచించారు.ఈ కార్యక్రమం లో డా జంబమ్మ ,రైతులను ఉద్దే శించి మాట్లాడుతూ వ్యవసాయం లో రైతులు యాంత్రీకరణ వైపు మళ్ళాలని,ఆయిల్ పామ్ సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి,మంచి దిగుబడులను సాధించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్ర మంలో పట్వారిగూడెం సర్పంచ్ కూరం అర్జున్ రావు,ఉప సర్పంచ్ బొల్లికొండ నాగేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి డి. కేశవరావు,పాల్గొని రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని, లాభసాటి వ్యవసాయము చేయాలని కోరారు.ఈ కార్యక్రమం అనంతరం సీఏచ్ ప్రసాదరావు,12 ఎకరాల ఆయిల్ పామ్ తోటలో క్షేత్ర సందర్శన చేసి పోషక,తెగుళ్ళ గురించి పలు సూచనలు శాస్త్రవే త్తలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ళ గురుమూర్తి, జగ్గారం సర్పంచ్ వంకా జానకిరాం రైతులు సూరిబాబు, రామకృష్ణ, కృష్ణారావు, వెంకటరావు, వసంతరావు, వెంకటేశ్వరరావు, నరేష్, రైతులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై సీపీఐ నిరసన



**దమ్మపేట, మే 06 (మనం న్యూస్):** దమ్మపేట మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్‌ను నివారిం చాలని,ఆయిల్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ, పాలకుల వైఫల్యాన్ని నిరసిస్తూ దమ్మపేట మండల సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యం లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మండల నాయకులు యార్లగడ్డ మణికంత, మాట్లాడుతూ ప్రజలకు నిత్యవ సరంగా మారిన డీజిల్ పెట్రోల్ గ్యాస్ మాత్రం అందుబాటులో లేదని ప్రస్తుతం పెళ్లిళ్లు వ్యవసాయ సీజన్ ముమ్మరంగా ఉన్న టైంలో ఆయిల్ కొరతను సృష్టించి రేట్లు పెంచేందుకే ఆయిల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అవకాశమిస్తుం దని,కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమెరికాకు ట్రంప్ కు లొంగిపోయి రష్యా ఇతర దేశాల నుండి సౌకగా ఆయిల్ కొనుగోలుకు అవకాశాలు న్న ట్రంప్ ఆదేశాలకు లొంగి దేశ ప్రయోజనాలను పణంగా పెట్టారని అన్నారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్ని కల తర్వాత భారీగా పెంచేందుకు కేంద్ర ప్రయత్నిస్తుందని అన్నారు. తక్షణమే బ్లాక్ మార్కెట్ ను అరిక ట్టి రవాణా వాహనాలతో పాటు రైతులకు ప్రజలకు అవసరమైన గ్యాస్ పెట్రోల్ డీజిల్ సక్రమంగా అందించాలని, ఆయిల్ కొరతను తీర్చకపోతే ప్రజాగ్రహాన్ని పాలకు లు గురికాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మత్తినేని శ్రీనివాస రావు,మధు,ప్రసాదు,సున్నం రజి ని,పానుగంటి చిట్టెమ్మ, వీరస్వా మి,పద్మ కుమారి,తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## యువత జీవితంలో స్థిరపడాలి



**భద్రాచలం, మే 6 (మనం న్యూస్) :** నిరుద్యోగులైన గిరిజన యువతి, యువకులు జీవితంలో స్థిరపడటానికి వై టి సి ద్వారా అందించే శిక్షణలు ఉన్న ఊరిని వదిలి బాహ్య ప్రపంచాన్ని చూసే విధంగా వారికి ప్రేరేపించి అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శిక్షకులు యువతీ ,యువకులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు.బుధవారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు సర్ సెంటర్ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను శిక్షకులతో,యువతీ యువకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న నిరుద్యోగ గిరిజన యువతి యువకులు పై చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఐటీడీఏ ప్రాంగణంలోని వై టి సి లో అందిస్తున్న వివిధ రకాల శిక్షణలను శ్రద్ధగా తీసుకొని ప్రభుత్వ,ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని ఆయన అన్నారు. ఈసారి బాగా గుర్తింపు పొందిన సంస్థలైన ఐటీ హెల్ప్ డెస్క్, అటెండెంట్ కోర్స్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కోర్స్, ఎంబ్రాయిడరీ మిషన్ ఆపరేటర్ కోర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్, టైలరింగ్ మిషన్ ఆపరేటర్ కోర్స్ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా శిక్షణలు ఇప్పిస్తున్నందున యువతి ,యువకులు శ్రద్ధగా మూడు నెలల పాటు శిక్షణ తీసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. సంబంధిత కంపెనీల శిక్షకులు యువతీ యువకులకు పూర్తిస్థాయిలో నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణలు అందించాలని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతీ యువకులకు తప్పనిసరిగా ఉపాధ్యాయ అవకాశాలు కల్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వై టి సి సెంటర్ ఇన్చార్జి శ్రీను, భవిత సేల్స్ సిబ్బంది సమ్మయ్య, మణిదీప్, దీనాకుమారి, అనురాధ, అభిరామ, గిరిజన యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల డాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి



**భద్రాచలం, మే 6 (మనం న్యూస్ ):** ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులకు వేసవిని దృష్టిలో పెట్టుకొని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని సరైన వైద్య సేవలు అందించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు.బుధవారం నాడు భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ వ్యాధులతో చికిత్స పొందుతున్న జనరల్ వార్డ్, మెటర్నిటీ వార్డ్, పీడియాట్రిక్ వార్డు, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించి మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు, సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.అటెండెన్స్ రిజిస్టర్లు, ఓపీ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లను సబ్ కలెక్టర్ తనిఖీ చేసి, విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇతర సిబ్బంది హాజరును కూడా పరిశీలించారు. ఏరియా ఆసుపత్రికి వచ్చిన రోగులతో సబ్ కలెక్టర్ కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అవసరమైన మందులు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ఎండలు ముదురుతున్నందున ప్రజలు ఎక్కువ శాతం వడదెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నందున బయటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రోగులకు సూచించారు.ఏరియా ఆసుపత్రిలో మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ ,వైద్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘాల ద్వారా రైతులు లబ్ధి పొందాలి

### - ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**దుమ్ముగూడెం, మే 6 ( మనం న్యూస్ ):** రైతులు సహకార సంఘంలో సభ్యులుగా చేరి సహకార సంఘాల ద్వారా రైతులకు కల్పించే సౌకర్యాలను పొందడం ద్వారా లబ్ధి పొందాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక –సహకార శాఖ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం నర్సాపురం రైతు వేదిక లో దుమ్ముగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కిలిమి ఎల్లారెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిస్థానిక శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు సహకార సంఘం ద్వారా రైతులకు అందుతున్న పంట ఋణాలు,ఎరువులు ,విత్తనాలు విక్రయం,గేదెల రుణాలు అంశాలపై పూర్తిగా రైతులకు వివరించడంతో పాటు రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, సి ఈ ఓ టి. హిమబిందు, సర్పంచ్ కుంజా కనక రత్నం,పాలక వర్గ సభ్యులు బొల్లి వెంకట్రావు, ఉబ్బ భద్రయ్య, కాలవ పూర్ణయ్య, కొమరం భద్రమ్మ, చాట్ల సరోజని దేవి, పాయం చలపతి రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఐక్య రైతు సంఘం బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం



**దుమ్ముగూడెం, మే 6 (మనం న్యూస్ ):** ఇల్లందు పట్టణంలో మే 11, 12,13 తేదీలలో సిపిఐ ఎంఎల్ మాసులెన్ ప్రజాపంద అనుబంధ ఐక్య రైతు సంఘం ఆలిండియా మహాసభలు జరగనుండగా 11వ తేదీన జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ములకపాడు నుండి దుమ్ముగూడెం మండల కేంద్రం లక్ష్మీనగరం ఎస్బిఐ స్టేట్ బ్యాంక్ సెంటర్ వరకు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ సభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రి శ్వరరావు, రైతు సంఘం నాయకులు కేజీ రామచంద్ర, తుమ్మలపల్లి ప్రసాద్ ఆహ్వాన సంఘం అధ్యక్షులు తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో దుమ్ముగూడెం సిపిఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి భద్రాచలం డివిజన్ నాయకురాలు శిమిడి సుజాత మండల నాయకురాలు చింతకాయల సరళ, నాగేష్, రాజేష్ పాల్గొన్నారు.

## ఆకాశాన్నంటుతున్న ధరలు.. సామాన్యుడిపై మోయలేని భారం

**–బూర్గంపాడులో సిపిఐ ధర్నా – పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్**

**– తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత**



**బూర్గంపహాడ్, మే 6 (మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో బుధవారం బూర్గంపాడు మండల కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ.. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరల ప్రభావం నిత్యావసర వస్తువులపై పడి సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం బతుకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని, కార్పొరేట్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను ప్రాథమిక హక్కుగా గుర్తించాల్సిన ప్రభుత్వం, ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరలను తగ్గించకుంటే, రాబోయే రోజుల్లో సిపిఐ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా పైన ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో బూర్గంపాడు సిపిఐ మండల కార్యదర్శి సప్పం నాగేశ్వరరావు, పెనుబల్లి మండల కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు నల్లజాల సత్యనారాయణ, అలవాల సీతారాంరెడ్డి, సొల్లు పుల్లయ్య, సిద్ధారపు సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు,పట్టణ కార్యదర్శి ముదిగొండ బాలకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన..

**–పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు – ఆలయ అభివృద్ధికి రూ. 50,000 విరాళం**



**బూర్గంపహాడ్, మే 6 (మనం న్యూస్):** మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో బుధవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో, గౌరవ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రేగా కాంతారావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆలయ అభివృద్ధికి చేయూత:** ఆలయ అభివృద్ధి పనుల కోసం రేగా కాంతారావు తన వంతు సహాయంగా రూ. 50,000 (యాభై వేల రూపాయలు) నగదును ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల గ్రామంలో శాంతి సౌభాగ్యాలు నెలకొంటాయని, ఆలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, స్థానిక ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, నాయకులు కామిరెడ్డి రామకొండారెడ్డి, గోవింద రెడ్డి, దివాకర్ రెడ్డి, బాదం నాగిరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదమరిస్తే ఇక అంతే..

- అధ్వాన్నంగా చీమలపాడు రహదారి
- రహదారికి ఇరువైపులా భారీగా గండ్లు
- వర్షానికి కొట్టుకుపోయినా మరమ్మత్తులు చేయని వైనం
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో గిరిజనం







**చర్ల, మే 6 (మనం న్యూస్) :** చర్ల మండలం చీమలపాడు రహదారి అద్వాన్నంగా మారింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్డు కొట్టుకుపోయింది. రహదారికి ఇరువైపులా భారీ గోతులు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై ఆదమరిస్తే ఇక అంతే సంగతులు. కళ్లెదుటే భారీ గోతులు కనపడితున్నా మరమ్మత్తులు చేపట్టకుండా అదికార యంత్రాంగం మొద్దునిద్రపోతోంది.

ఆర్ అండ్ బి రహదారి నుండి చీమలపాడు గ్రామం వరకు గల సుమారు రెండు కిలోమీటర్ల బిటి రహదారి పనులన రూ. 55 లక్షల ఐటిడిఏ నిదులతో నిర్మించారు. రహదారి వేసిన సమయం లోనే సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసినట్లు ఆరోపణలు వినవచ్చాయి. రహదారి నిర్మాణం మొక్కుబడిగా చేపట్టి సైడ్ బర్మ్ లకు గ్రావెల్ పోయకుండా వదిలేసారు. దీంతో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్డు దెబ్బతిన్నది. వరద నీరు రోడ్డుపై నుండి ప్రవహించడంతో ఇరువైపులా మట్టి కొట్టుకుపోయి భారీ గోతులు ఏర్పడ్డాయి. గ్రామ సమీపంలోని కల్వర్ట్ కు రద్రం ఏర్పడింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా సంబంధించిన అదికా రులు నేటి వరకు మరమ్మత్తులు చేపట్టిన పాపానపోలేదు. మండల కేంద్రానికి కూత వేటులోనే గ్రామం ఉండటంతో తరచూ అదికారులు ఈ మార్గాన రాకపోకలను సాగిస్తుంటాయి. అయినా రోడ్డు మరమ్మత్తు లు చేయించాలన్న కనీస సామాజిక బాద్యత లేకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రహదారిని నిర్మించిన సంబంధించిన కాంట్రాక్టర్ మెయింటనెన్స్ పనులు చేయాల్సి ఉన్నా నేటి వరకు రహదారి వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇంజనీరింగ్ అదికారులు సైతం చొరవ చూపకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వందల మంది జనం చర్ల, వెంకటాపురం, సమీప గ్రామాలకు వెల్లాలంటే ఈ మార్గం ద్వారానే రాకపోకలను సాగించాల్సి ఉంటుంది. రహదారి పక్కన భారీ గోతులు ఉండటం, రోడ్డు పలు మలుపులు తిరిగి ఉన్న కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రివేళ ఈ మార్గం మరీ ప్రమాకరం. చీకట్లో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ప్రమాదం సంభవించి అనేకమంది గిరిజనులు గ్రామపడిన సంఘటనలు ఉన్నాయి. రాత్రివేళ ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని, ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగి గాయాల పాలవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. మరమ్మత్తులు చేపట్టాల్సిన సంబంధిత ఇంజనీరింగ్ అదికారులు మొహం చాటేసినా కనీసం గ్రామ పంచాయతీ పాలక వర్గం చొరవ చూపి దెబ్బతిన్న రహదారికి మరమ్మత్తులు చేపట్టి తమ ప్రాణాలను కాపాడాలని గ్రామానికి చెందిన గిరిజనులు కోరుతున్నారు.

## శివాలయంలో వైభవంగా మహా కుంభాభిషేకం



**చర్ల, మే 6 (మనం న్యూస్) :** చర్లలోని ఉమారామలింగేశ్వర స్వామివారి ఆలయం పుణ:ప్రతిష్టించి రెండు పుష్కరాలు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆద్వర్యంలో రెండవ మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. బుధవారం వైశాఖ మాస కృష్ణపక్ష పంచమి రోజున ఆలయ అర్చకులు సాయికృష్ణ శర్మ, తేజశర్మ, యల్లమందల భాణుప్రకాష్ ల ఆద్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ శిఖరం పైనుండి పసుపు, కుంకుమలతో జలాభిషేకం నిర్వహించారు. భూరెలతో అభిషేకం నిర్వహించగా భక్తులు వాటిని ప్రసాదంగా స్వీకరించారు. తదుపరి ఉమారామలింగేశ్వర స్వామివారికి పంచ అమృత, అన్నాభిషేకం చేసారు. మద్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం శివపార్వతుల కళ్యాణం కన్నులపండువగా సాగింది. కార్యక్రమంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ విస్తృత ఏర్పాటు చేసారు. భక్తులు పెద్దసంఖ్యలో కుంభాభిషేకంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## సత్యనారాయణపురంలోనే అంబులెన్స్ ఉంచాలి

- ఆర్ కొత్తగూడెం సర్పంచ్ రవికుమార్



**చర్ల, మే 6 (మనం న్యూస్) :** సత్యనారాయణపురం ప్రాదమిక ఆరోగ్య కేంద్రంకు చెందిన అంబులెన్స్ ను చర్లకు తరలించడంపై ఆర్ కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్ అభ్యంతరం వ్యక్తం చేసారు. బుధవారం గ్రామంలో జరిగిన సమావేశం ఆయన మాట్లాడారు. తేగడ గ్రామం వద్ద నుండి దేవరాపల్లి రాళ్లగూడెం గ్రామం వరకు గల ప్రాంతంలో ప్రమాదాలు, ఇతర అత్యవసర చికిత్సల సందర్భంలో రోగులు సత్యనారాయణపురం వైద్యశాలకు తరలివెలతారని, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను సైతం అక్కడికే తరలిస్తారని, ఇక్కడ అంబులెన్స్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం చర్లలో ఒక అంబులెన్స్ ఉన్నదని, సత్యనారాయణపురం పి హెచ్ సి కు చెందిన అంబులెన్స్ ను కూడా అక్కడికే పంపితే ఈ ప్రాంత ప్రజలు అవస్దలు పడతారని అన్నారు. అదికారులు పుణరాలోచించి చర్లకు పంపిన అంబులెన్స్ ను తిరిగి సత్యనారాయణపురంకు పిలిపించి ఇక్కడి రోగులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసారు. సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు కణితి రజిని, గొర్స పవన్ చారీ, కాసర్ల బన్ను, పాండవుల నాగరాజు, రుంజా రాజా పాల్గొన్నారు.

# మనం



# చర్ల

చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

## చర్లలో రైతు సంక్షేమ అవగాహనా సదస్సు





**చర్ల, మే 6 (మనం న్యూస్) :** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చర్లలోని రైతు వేదికలో బుధవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సంక్షేమ అవగాహన సదస్సులో పలువురు అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొని రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్ మాట్లాడుతూ పంట రుణాలు, ఎరువులు, పురుగు మందులు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, సీఎస్సీ, ఏఈవో సర్వీసులు, బంగారంపై రుణాల విషయంలో సహకార సంఘం తరపున రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు సంబంధించిన ప్రతి విషయంలోనూ తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెటింగ్ పరిదిలోని మండలాలలో నాణ్యత లేని విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు రైతులను మోసం చేయవద్దని, రైతులు కూడా కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ డిఈఈ తిరుపతిరావు మాట్లాడుతూ చెరువుల్లోని మట్టి వ్యవసాయానికి ఎంతో అనుకూలమని తెలిపారు. చెరువుల పూడిక తీసే సమయంలో రైతులు దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇచ్చి మట్టి తరలింపునకు సహకరిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని రైతాంగం సద్వినియోగపరుచుకొని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, ఏడిఏ సుధాకర్ రావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కనపర్తి ఈదయ్య, మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, మండల వ్యవసాయ అదికారిని ఎస్ లావణ్య, ఏఈవో అఫ్రిది, రైతు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారు రామకృష్ణ, పిఏసిఎస్ సీఈవో రామచంద్ర ప్రభు, ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, దేవా నగరం సర్పంచ్ పూనెం జోగ మహాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## పూడికతీత పనులను పరిశీలించిన ఎంపిడివో





**చర్ల, మే 6 (మనం న్యూస్) :** మండలంలోని తేగడ గ్రామ పంచాయతీ పరిదిలో ఉపాదిహామీ పథకం ద్వారా జరుగుతున్న చెరువు పూడిక పనులను మండల పరిషత్ అభివృద్ధి అదికారి కనపర్తి ఈదయ్య పరిశీలించారు. బుధవారం పనుల వద్దకు వెల్లిన ఆయన మస్టర్ వెరిఫికేషన్ చేసారు. పని ప్రదేశంలో కార్మికులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ఎండవేడిమి నుండి రక్షణ కల్పించే టెంట్ల ఏర్పాటు, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ లు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీసారు. కార్మికులు పనులు చేసే సమయంలో గాయాలపాలు కాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, గాయపడ్డ వారికి ప్రదమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈజిఎస్ ఏపివో సాంబశివరావు, తేగడ గ్రామ పంచాయతీ సర్పంచ్ జమ్ముల మురళీకృష్ణ, ఉప సర్పంచ్ పాగ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి హర్షిణి, ఫీల్డ్ అసిస్టెంట్ సర్వేశ్వరావు పాల్గొన్నారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి



## రైతు వారోత్సవాలలో పాల్గోన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**వ్యవసాయ ఉత్పత్తులు, బ్యాంక్ పంట ఋణాల పట్ల రైతులకు అవగాహన కల్పించిన ఏఎంసి, చైర్మెన్ రాంబాబు**
**రైతులకు అవసరమైన జొన్నల బస్తాలు రైతులకు సకాలంలో అందేలా చూడాలి నిల్వ ఉన్న సరుకు గౌడౌను తరిలించాలి**
**మార్కెట్ గిడ్డంగిలో నిల్వ ప్రక్రియ ఫ్రారంభించాలి**
**జిల్లా వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**



**ఇల్లందు, మే 06 (మనం న్యూస్) :** ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, అధ్యక్షతన నిర్వహించిన రైతు వారోత్సవం, ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ, పంట ఉత్పత్తులు, బ్యాంకు రుణాలపట్ల రైతులుకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు, మార్కెట్ ప్రాంగణంలో నిల్వ ఉన్న సరుకు తరలింపు ప్రక్రియ రైతులకు అందవలసిన జొన్నల బస్తాలు సంబంధిత విషయాలపై జిల్లా అధికారులతో చరవాణిలో సంభాశించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గిడ్డంగిలో నిలువ ప్రక్రియ తక్షణ ప్రారంభించేలా చూడాలని అధికారుల ఆదేశించిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, ఈ సమావేశంలో మార్కెట్ ఇంచార్జ్ మార్కెట్ ,ఎస్బిఐ, బ్యాంక్ అధికారులు, మార్కెట్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముందు వైన్స్ షాపు.. వెనుక ఫైన్ (బెల్ట్ )షాపు

**- ప్రభుత్వ పర్మిషన్ వైన్ షాపులు రెండు..**
**- వీధి వీధికి బెల్ట్ షాపులు**
**- వైన్స్ షాపులకు, దేవతల పేర్లా**
**- బెల్ట్ షాపుల్లో మందు దొరికినట్లు యూరియా కట్టలు దొరికితే రైతుల ఇబ్బందులు తీరేవి**
**- ఎమ్మార్పీ రేట్ల మీద 15 నుండి 30 రూపాయల అధిక ధరలతో సిండికేట్ దందా**
**- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు**







**టేకులపల్లి మే 6(మనం న్యూస్) :** టేకులపల్లి మండలంలో 36 గ్రామపంచాయతీలు .36 గ్రామపంచాయతీలు కలిగిన ఈ మండలానికి ప్రభుత్వం రెండు వైన్ షాపులు కు టెండర్ల ద్వారా పర్మిషన్ ఇచ్చింది.ఈ రెండు వైన్ షాపుల యజమానులు సిండికేటుగా ఏర్పడి. సిండికేట్ వ్యాపారి,నాయకత్వంలో టేకులపల్లి మండలంలోని 36 గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలలో ఉన్న కిరాణా షాపులను బెల్ట్, షాపులు గా మార్చినారు.గ్రామాన్ని బట్టి ఒక గ్రామంలో మూడు నుండి సుమారు 6 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం అవగాహనలోపమా? గ్రామాలలోని బెల్ట్ షాపులకే సుమారు పదివేల రూపాయల కె పర్మిషన్ ఇచ్చిన రాష్ట్ర మొత్తం మీద బెల్ట్ షాపులు రూపంలో అత్యంత ఆదాయం వస్తుంది, కదా! వైన్స్ సిండికేట్ ద్వారా బాలాజీ లాంటివారు ఎంఆర్పి = 190 రూ" బీరు ను =250రూ,, రాయల్ స్టాగ్ =270రూ,, ఐబి =240రూ,, ఎమ్ఎచ్ =230,, ఓసి =230రూ,, ఓయ =190రూ,, సిండికేటు, బెల్ట్ షాప్ వారు కలిసి కస్టమర్ నుండి ఎమ్మార్పీ రేటు పై 15 నుండి 30 రూపాయల అధికంగా వసూలు చేస్తూ లాభాలు అర్జిస్తుంటే ప్రశ్నించే నాయకులే లేరా అని కస్టమర్ మనోవేదన చెందుతున్నారు. సిండికేట్ దారులు రెండు సంవత్సరాల కాలంలో అన్ని ఖర్చుల పోగా రెండు నుండి మూడు కోట్లు ఆదాయం పొందుతున్నారు.ఇవే వైన్స్ షాపులను ప్రభుత్వ పరిధిలో కొనసాగిస్తే చాలామంది నిరుద్యోగి యువతీ,యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది కదా! నిరుద్యోగి యువతీ యువకులు చర్చిస్తున్నారు.

**కంచే, చేను మేస్తే కాసేది ఎవరు?**

టేకులపల్లి మండలం ఎక్సైజ్ డిపార్ట్మెంట్గా ఇల్లందు అధికారుల పరిధిలో ఉంటుంది. ఈ టేకులపల్లి మండలం, ఇల్లందు, ఆళ్లపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం అయిన లక్ష్మీ పల్లి, సుజాతనగర్, మండలాల మధ్యలో ఉంటుంది. టేకులపల్లి నుండిఅన్ని మండలాలకు రోడ్డు రవాణా సౌకర్యాలు ఉన్నాయి. ఆయా మండలాల నుండి తక్కువ ఖర్చుతో మందు తీసుకువస్తే ఎక్సైజ్ అధికారులే తనిఖీలు చేసి ఇది టేకులపల్లి వైన్ షాప్ స్టిక్కర్లేదు, దొంగమందని, దొరికిన సరుకుని ఎత్తకెల్లడమే కాకుండా కేసులు బనాయిస్తున్నారని కిరాణా (బెల్ట్ షాప్) యజమానులు వాపోతున్నారు. ఈ విధంగా కిందిస్థాయి నుండి జిల్లా స్థాయి ఎక్సైజ్ అధికారులకు సిండికేట్ వైన్స్ యజమానులకు ఎంత....? ఎంత... ముడుపులు ముడుతున్నాయెూ అనే విశ్లేషకులు, అభిప్రాయపడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు ప్రజల డబ్బును, ప్రభుత్వం ద్వారా ప్రతి నెల జీతాలు తీసుకుంటూ కస్టమర్లకు ప్రజలకు సేవ చేసేది పోయి సిండికేట్ దారులకు కాపలాదారులుగా మారిపోయినారని ప్రజలు ముఖ్యంగా కస్టమర్లు వారి ఆవేదాన్ని వ్యక్తపరుస్తున్నారు.

**ఎస్ టి, కోయ, ఎస్టీ లంబాడా కలిగిన ఏజెన్సీ ఏరియా గల మండలం**

ఈ మండలంలో వందకి వంద శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. వీరు పత్తి, మొక్కజొన్న, మిర్చి, పంటలకు ఎగరానికి ఒక్క యూరియా, కట్ట దొరకదు గాని గ్రామాలలో 24 గంటలు చిన్న చిన్న కిరాణా షాపులలో మందు దొరికినట్టుగా యూరియా, కట్టలు దొరికితే బాగుండు అట్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులు కృషి చేస్తే బాగుండు అని రైతాంగం భావిస్తున్నారు. ఈ విషయాలపై టేకులపల్లి సిండికేట్ వ్యాపారితో, టేకులపల్లి మండల రిపోర్టర్, ఇల్లందు ఆర్ సి, ఇంచార్జి వారం రోజులుగా కలవాలని ప్రయత్నించిన, ఇంటికెళ్లిన కలవకపోవడం, ఫోన్లు చేయగా చేయగా రింగ్ అయితే కట్ చేయడం, ఒకవేళ ఫోను లిఫ్ట్ చేసిన మాట్లాడి మాట్లాడినట్టుగా బిజీ అని చెప్పడం, ఇసుకపోయినా ఫలితం లేక ముఖాముఖి చర్చను విరమించు కోవడం జరిగింది. కావున సంబంధిత ఎక్సైజ్ అధికారులు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం బెల్టు షాపులపై, ఎమ్మార్పీ రేట్లపై కస్టమర్లకు ప్రజలకు మేలు జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కస్టమర్లు ప్రజానీకం కోరుతున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కొత్త కోర్సులు : ప్రిన్సిపల్ పద్మ

**- అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్!!**

**పాల్వంచ, మే 6(మనం న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో 2026--2027 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ పోలారపు పద్మ తెలిపారు. యూజీసీ ఆమోదంతో, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ మార్గదర్శకాల ప్రకారం "అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏ ఈ డి పి) ను కళాశాలలో అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిలో భాగంగా బీకాంలో (బీఎఫ్ ఎస్ఐ) బిఎస్సి లో హెల్త్ కేర్ మేనేజ్మెంట్ వంటి కోర్సులు ఈ విద్యా సంవత్సరానికి ప్రారంభించామని తెలిపారు. ఈ కోర్సుల్లో విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు పరిశ్రమల్లో ప్రాక్టికల్ శిక్షణ, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించబడతాయి. కోర్సు వ్యవధి మూడు సంవత్సరాలు కాగా, ఐదో సెమిస్టర్ లో 6 నెలల చెల్లింపు అప్రెంటిస్ షిప్ ఉంటుంది. శిక్షణ కాలంలో నెలకు రూ 7 వేల నుండి రూ12 వేల వరకు స్టైపెండ్ పొందే అవకాశం ఉంది. బికాం -- బిఎఫ్ఎస్ఐ కోర్సు ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఫిన్‌టెక్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే బిఎస్సి హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు ద్వారా హాస్పిటల్ మేనేజ్‌మెంట్, పేషెంట్ కేర్, హెల్త్ ఇన్సూరెన్స్, హెల్త్ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏ విభాగం నుండైనా ఈ కోర్సులకు అర్హులు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బలమైన కెరీర్ నిర్మించుకోవాలని ఆమె కోరారు. దోస్త్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్ పొందాలని తెలిపారు. దోస్త్ మొదటి పేజ్ ఈనెల ఏడో తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. రెండో విడత రిజిస్ట్రేషన్ ఈనెల 15 నుండి 25 వరకు, మూడో విడత రిజిస్ట్రేషన్ ఈనెల 31 నుండి జూన్ 15 వరకు దోస్త్ అడ్మిషన్స్ జరుగుతాయని ఆమె తెలిపారు.





మనం



# పినపాక

పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

## రక్తదానం ప్రాణదానంతో సమానం.. సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

**-ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
**- ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా బూర్గంపహాడ్‌లో భారీ రక్తదాన శిబిరం**



**బూర్గంపహాడ్, మే 6 (మనం న్యూస్):** రక్తదానం అనేది ఒకరి ప్రాణాన్ని కాపాడే అత్యంత పవిత్రమైన కార్యమని, ఇది ప్రాణదానంతో సమానమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారి జన్మదినాన్ని పురస్కరించుకుని బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డీసీహెచ్ఎస్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు మరియు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు తన జన్మదినం సందర్భంగా నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులను కాపాడటమే కాకుండా, దాతల ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన యువతను, నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పినపాక ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**అశ్వాపురం, మే 6 ( మనం న్యూస్ ):** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చేత కేక్ కట్ చేయించి కార్యకర్తలకు నాయకులకు తినిపించారు, కార్యకర్తల కేరింతల మధ్య ఎమ్మెల్యే పుట్టినరోజు కార్యక్రమం పండుగలా జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ లు ఏనిక ఉషారాణి, మచ్చా నరసింహారావు, సబ్కా పిచ్చయ్య, కుంజా జాను, ఎట్టి నరేష్, ఇర్పా రాజు, బట్టా సత్యనారాయణ , కాకా రాములు, తూము వీరరాఘవులు, కొండాబత్తుల ఉపేందర్, ఆవుల రవి, సామకూర వెంకన్న, బరాజు సంపత్, సోడే వెంకటేశ్వర్లు, కోండ్రు రామచంద్రయ్య, తెల్లం నాగరాజు, సింగం శ్రీధర్, బచ్చు వెంకటరమణ, తెల్లం వీరభద్రం, గాదె ప్రతాపరెడ్డి, మారం మల్లిఖార్జునరావు, కన్నెబోయిన నాగరాజు, చెంచల రాము, వేముల విజయ్, మారం నాగేశ్వరరావు, గొల్లపల్లి నరేష్, కోలా శశికాంత్, శెట్టిపట్టి రాము, వీరబోయిన ప్రేమ్ కుమార్, కందుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్,పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలి

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు డిమాండ్**



**అశ్వాపురం, మే 6 ( మనం న్యూస్ ):**మండలంలో గ్యాస్,పెట్రోల్,డీజిల్ కొరతను నివారించి దిగుమతులను పెంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమటం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ,గ్యాస్ కొరతతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒకవైపు డీజిల్ లేక రైతాంగం ట్రాక్టర్లు నడపలేక పంటలకు ఇబ్బందులు జరుగుతున్నాయని, రవాణా వ్యవస్థ పూర్తిగా కుంటుపడి పోతుందని, ప్రతి కుటుంబం వీటి మూలంగా ఏదో ఒక రూపంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని, మధ్య, పేద తరగతి కుటుంబాల వారు గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతుంటే కొంతమంది దళారులు మార్కెట్లో వీటిని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ద్విచక్ర వాహనదారుడు పెట్రోల్ కొనుక్కుందామంటే గంటల తరబడి పెట్రోల్ బంక్ లో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వీటన్నింటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని, అధికారులు మాత్రం గ్యాస్ , పెట్రోల్, డిజిల్ కొరత లేదని చెబుతున్నారు, తప్ప ఆచరణలో వాటిని నివారించే చర్యలు ఏమాత్రం చేపట్టడం లేదని ఆరోపించారు. మొన్నటి వరకు యుద్ధం పేరుతో గ్యాస్ దొరకడం లేదని కుంటి సాకులు చెప్పారని, నేడు ఏమైందని ఉన్నటువంటి వాటిని బ్లాక్ మార్కెట్లలో అధిక రేట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు తప్ప సామాన్యుడి బాధలు, కష్టాలు తీర్చే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వీటిపై దృష్టి సారించి పెట్రోల్ డీజిల్ గ్యాస్ కొరత నివారించి అందరికీ అందుబాటులో తెచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని తహశీ ల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్,ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షులు జక్కుల రామచంద్రరావు,ఏఐటీయూసీ మండల అధ్యక్షులు రాయపూడి రాజేష్,సిపిఐ మండలం సహాయ కార్యదర్శి మేలపుర సురేందర్ రెడ్డి, కొండపర్తి ప్రసాద్, బండ్ల సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లపల్లి నూతన తహశీల్దార్‌గా జి.ఉమారాణి



**ఆళ్లపల్లి, మే 6 (మనం న్యూస్):** ఆళ్లపల్లి మండల నూతన తహసీల్దార్‌గా జి. ఉమారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు చేపడతానని తెలిపారు. భూ సమస్యలు, ధరణి దరఖాస్తులు, పింఛన్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

## వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ వంటావార్పు



**బూర్గంపహాడ్, మే 6(మనం న్యూస్):** మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 42 రోజులుగా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రిలేనిరాహారదీక్షలు చేస్తున్న సంగతి పాఠకులకు విధితమే. మంగళవారం రాత్రి జనరల్ బాడీ మీటింగ్లో గుర్తింపు సంఘం వేతన ఒప్పంద వివరాలు వెల్లడించిన తర్వాత కాంట్రాక్టు కార్మికులు వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా పీఎం 6 గేటు వద్ద వంటావార్పు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. వేతన ఒప్పందంలో కాంట్రాక్టు కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని సీ షిఫ్ట్ కార్మికులు విధులు బహిష్కరించడంతో అదే సమయంలో ఓ కాంట్రాక్టర్ కార్మికులను లోనికి పంపే ప్రయత్నం చేశారని...ఆ క్రమంలో జరిగిన తోపులాటలో ఓ కార్మికుడి తలపై రాడ్డుతో వెనుక నుంచి దాడిచేయడంతో తలకు తీవ్రగాయమైందని.. స్థానికులు అతన్ని ఆసుపత్రికి పంపినట్లు కార్మికులు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులపై ఇలాంటి దాడుల చేయడం అన్యాయమని... తమకు న్యాయం జరిగేంతవరకు నిరసన తెలుపుతామని కాంట్రాక్టు జేఏసీ కార్మిక నాయకులు పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజాము వరకు వంటావార్పుతో కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలుపుతూనే ఉన్నారు. నిరసన అనంతరం కాంట్రాక్టు కార్మికులతో యాజమాన్యం, గుర్తింపు సంఘం చర్చలు జరిపి మూడు రోజుల పాటు సమ్మెను వాయిదా వేయాలని అడిగారని... కాంట్రాక్టు కార్మికులు ఆ మేరకు అంగీకారం తెలిపారని...సమస్య పరిష్కారం కాకపోతే గడువు తర్వాత మళ్లీ సమ్మె చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

## మండలంలో తునికాకు సేకరణ షురూ



**అశ్వాపురం, మే 6 ( మనం న్యూస్ ):** మండలంలో తునికాకు (బీడీ ఆకు )సేకరణకు గిరిజనులు బుధవారం శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనులకు వేసవిలో తునికాకు సేకరణ జీవనాధారంగా మారింది. గిరిజన గ్రామాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు రెండు నెలల పాటు సాగే ఈ సీజన్ లో ఒక్కో కుటుంబం రోజుకు 50 నుండి 80 కట్టలు సేకరించి జీవనోపాధి పొందుతారు. 50 ఆకులు ఉండే కట్టకు ప్రభుత్వం రు 3.40 పైసలు చెల్లిస్తుండగా, కాంట్రాక్టర్ కట్టకు మరో రెండు పైసలు అదనంగా చెల్లిస్తాడు. గిరిజనులు ఉదయాన్నే అడవికి వెళ్లి ఆకు సేకరించి, మధ్యాహ్నా సమయంలో కట్టలు కడతారు.

# అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి విజయకేతనం



- భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి
- జాంబియాలో జరిగిన పోటీలలో ప్రతిభ చాటిన సింగరేణి రెస్క్యూ బృందం
- అభినందనలు తెలిపిన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి
- సోషల్ మీడియాలో కార్మికులు అధికారుల ప్రశంసల హర్షం
- రెండు దశాబ్దాల తరువాత అంతర్జాతీయ స్థాయిలో సింగరేణికి బహుమతి

**కొత్తగూడెం సింగరేణి, మే 06(మనం న్యూస్):** ఇటీవల జాంబియా దేశంలో జరిగిన అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలలో సింగరేణి జట్టు తన ప్రతిభను చాటి భూగర్భ రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతిని సాధించి విజయకేతనం ఎగుర వేసింది. ప్రపంచంలోని పలు దేశాల రెస్క్యూ జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో భారత్ నుంచి కోల్ ఇండియాతో పాటు సింగరేణి, మరికొన్ని కంపెనీలు కూడా పాల్గొన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి మరోమారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటడం విశేషం. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు జాంబియా దేశంలో ఈ పోటీలు జరిగాయి. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు ప్రకటించారు. భూగర్భ గనులలో ప్రమాదాల సమయంలో రెస్క్యూ బృందం సేవలపై నిర్వహించిన పోటీలో ఫైర్ ఫైటింగ్ కు 20 మార్కులు, రెస్క్యూకు 20 మార్కులు, సాంకేతిక సహాయానికి 10 మార్కులు ఉండగా సింగరేణి జట్టు అత్యద్భుత ప్రతిభ కనబరిచి ఇతర కంపెనీల అన్నిటికన్నా మిన్నగా నిలిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది.

భూగర్భ రెస్క్యూ పోటీ ఈ విధంగా కొనసాగింది.. ముందుగా ముఫూలిరా పట్టణంలోని మోపాని సెంట్రల్ ట్రైనింగ్ సెంటర్ లో 90 నిమిషాల నిడివి గల టెక్నీషియన్ టెస్టును నిర్వహించగా సింగరేణి నుంచి సాయి కృష్ణ ఈ టెస్ట్ ను 52 నిమిషాల్లో విజయవంతంగా పూర్తి చేశాడు. కార్బన్ డయాక్సైడ్ అబ్జార్బ్ క్యానిస్టర్ లో తలెత్తిన లోపాలను సవరించి తిరిగి దానిని నింపడం వంటి ప్రక్రియను వేగంగా పూర్తి చేశాడు. తర్వాత 700 మీటర్ల లోతులో భూగర్భ గనిలో ప్రమాదం బారిన పడిన ఇద్దరిని వెతకడం, రక్షించడం అనే పోటీ నిర్వహించారు. దీనిని అదే పట్టణంలో ఉన్న వెస్ట్ పోర్టల్ మైన్ లో నిర్వహించారు. దీనికి రెండు గంటల సమయాన్ని కేటాయించినప్పటికీ మన సింగరేణి జట్టు కేవలం 52 నిమిషాల్లో ఈ పోటీని విజయవంతంగా పూర్తి చేసింది. ఈ పోటీలో ముందుగా పంపుకి ఎల్ బెండును పెట్టడం సబ్ స్టేషన్ లో విద్యుత్తు నిలిపివేయడం ఇవ్వబడిన మైన్ ప్లాన్ ప్రకారం తప్పిపోయిన ఇద్దరు వ్యక్తుల ఆచూకీని వేగంగా కనుగొనడం చేశారు. ఇందులో ఒక వ్యక్తి ఎల్.హెచ్.డి యంత్రం సమీపంలో స్పృహ లేకుండా పడి ఉండగా అతనికి ఊపిరి అందేలా చేసి రక్షించారు. మరొక వ్యక్తి గాయాలతో పడి ఉండగా అతన్ని పూర్తి రెస్క్యూ పద్ధతిలో 700 మీటర్ల పైన ఉన్న గని ఉపరితలానికి విజయవంతంగా తరలించారు. ఈ మొత్తం పోటీని ఇద్దరు జడ్జీల టీం పరిశీలించింది. పై విభాగాలలో సింగరేణి యువ రెస్క్యూ జట్టు ఎంతో అప్రమత్తంగా, ఉత్సాహంగా, క్రమశిక్షణతో పాల్గొని ఇచ్చిన సమయం కన్నా తక్కువ వ్యవధిలోనే పూర్తి చేసి అందరి ప్రశంసలు అందుకుంది.

**సింగరేణి యువ రెస్క్యూ టీంకు సింగరేణి సీఎండీ అభినందనలు..**

అంతర్జాతీయ స్థాయిలో సింగరేణి సంస్థ భూగర్భ గనుల రెస్క్యూ విభాగంలో ప్రథమ బహుమతి సాధించడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమం. దీనిపై సంస్థ ఛైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తన అభినందనలు తెలియజేశారు. అలాగే ఈ పోటీల్లో పలు బహుమతులు సాధించిన కోల్ ఇండియాకు చెందిన డబ్ల్యూ.సి.ఎల్ రెస్క్యూ జట్టుకు కూడా ఆయన అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో భారతదేశం నుండి కోల్ ఇండియా సింగరేణితో పాటు పలు కంపెనీలు పాల్గొన్నాయి. అలాగే చైనా, కొలంబియా, జాంబియా, కెనడా, ఆస్ట్రేలియా, పోలాండ్ ఇంకా ఇతర దేశాల జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటాయి. సింగరేణి రెస్క్యూ జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి సారథ్యంలో రామగుండం మైన్స్ రెస్క్యూ స్టేషన్ లో సింగరేణి నుంచి ఎంపిక చేసిన జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సింగరేణి మైన్స్ రెస్క్యూ జట్టులో జి.ప్రమోద్ కుమార్, బి.నితిన్ కుమార్, ఎన్.భానుప్రసాద్, ఏ.శ్యాం కుమార్, ఆర్.శ్రీకాంత్, సి.హెచ్. సాయి కృష్ణ , ట్రాన్స్ లేటర్ గా జి.రాజేందర్ రెడ్డి ఈ పోటీలలో పాల్గొన్నారు. కాగా దేశంలోనే తొలిసారిగా ఈ పోటీలకు ఫస్ట్ ఎయిడ్ విభాగానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం కోసం సింగరేణి సంస్థలో పని చేస్తున్న డాక్టర్ రాజేశ్వర్ ను అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ నిర్వాహకులు ఆహ్వానించారు. డాక్టర్ రాజేశ్వర్ ఈ అంతర్జాతీయ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సింగరేణి రెస్క్యూ జట్టు అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు సాధించటంపై సింగరేణి ఉద్యోగులు, అధికారులు వివిధ మాధ్యమాలలో తమ అభినందనలు తెలుపుతున్నారు.

# రైతు సంక్షేమానికి చర్యలు వేగవంతం చేయాలి

- అవగాహన సదస్సులో నేతల డిమాండ్
- కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి రైతుల సమస్యలపై కీలక సూచనలు
- అర్హత ఉన్న రైతులకు కొత్త సభ్యత్వాలు ఇచ్చి రుణాలు మంజూరు చేయాలి
- ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించాలి
- ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందుబాటులో ఉంచాలి
- యూరియా కొరత లేకుండా ముందస్తు నిల్వలు ఏర్పాటు చేయాలి
- సుజాతనగర్‌లో సహకార బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలి
- పశువుల కొనుగోలు, షెడ్ నిర్మాణానికి రుణాలు సులభతరం చేయాలి



**సుజాతనగర్, మే 6 (మనం న్యూస్) :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ రైతు వేదికలో రైతు సంక్షేమ అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తగూడెం సహకార సంఘం ఛైర్మన్ మండే వీర హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి పాల్గొని రైతుల సమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్తగూడెం సొసైటీ పరిధిలో భూమి కలిగి అర్హత ఉన్న రైతులకు కొత్త సభ్యత్వాలు ఇచ్చి సులభంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో యూరియా కొరత తలెత్తకుండా ముందస్తుగా సరిపడ నిల్వలు ఉంచాలని, ముఖ్యంగా సుజాతనగర్ మండల కేంద్రంలో రైతుల సౌలభ్యం కోసం సహకార బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గేదెలు, పశువుల షెడ్ నిర్మాణానికి రుణాల ప్రక్రియను సులభతరం చేసి రైతులకు మద్దతు ఇవ్వాలని సూచించారు. అలాగే నాబార్డ్ నిధుల ద్వారా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించి, ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలకు జీవనోపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం సుజాతనగర్ మండల కేంద్రంలో గోడౌన్ ఏర్పాటు చేయాలని చైర్మన్ మండే వీర హనుమంతరావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వీరబాబు, సొసైటీ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్, వ్యవసాయ అధికారులు, సొసైటీ బాధ్యులు, బ్యాంకు మేనేజర్లు, వివిధ పార్టీల నాయకులు, మండల రైతులు పాల్గొన్నారు.



# జిల్లా టాపర్లను అభినందించిన డిఈఓ నాగలక్ష్మి

**లక్ష్మీదేవిపల్లి మే 06 (మనంన్యూస్):** ఇటీవల విడుదలైన తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అద్భుత ప్రతిభ కనబరిచిన త్రివేణి పాఠశాల విద్యార్థులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి బి. నాగలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని బి. అక్షయ శివాని 592 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, పి. అక్షయ్ మరియు కె. వర్షిత 586 మార్కులతో జిల్లా ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, పాఠశాల యాజమాన్యాన్ని డీఈఓ సాదరంగా ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. కఠోర శ్రమ, క్రమశిక్షణతో చదివి జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి కొత్తగూడెం కీర్తిని చాటిన విద్యార్థులు అందరికీ ఆదర్శమని కొనియాడారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో భవష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన త్రివేణి విద్యాసంస్థల విద్యా ప్రమాణాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి-కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు జి. జగదీష్, జి. వీరేంద్ర చౌదరి, సి.ఆర్.ఓ కె. మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సింగ్, మరియు స్కూల్ ఇంచార్జ్ లు శ్రీకాంత్, హనుమంతరావు పాల్గొన్నారు. విద్యార్థుల అద్భుత విజయానికి వారు సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కొనసాగుతున్న దోస్త్ ప్రవేశాలు

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** 2026-27 వార్షిక విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్త్ ద్వారా డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరే ప్రక్రియ కొనసాగుతున్నదని



ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటివిడత ప్రవేశాల ఆన్లైన్ నేడు గురువారం తో ముగియనున్నదని, వెబ్ ఆప్షన్స్ 8వరకు పెట్టకోవచ్చని, అదేవిధంగా రెండవ విడత ఈనెల 15నుంచి ప్రారంభమౌతుందని వెల్లడించారు. మొదటి విడతలో ఆన్లైన్ చేయని వారు రెండవ విడత లో చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ సలీం పాషాను, టెక్నికల్ అసిస్టెంట్ యాలాద్రి ని సంప్రదించాలని సూచించారు .

# పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** స్థానిక ఎస్ ఆర్ బి జి.ఎన్.ఆర్ కళాశాలలో బి.బి.ఏ చదువుకుని ప్రతిష్టాత్మక మైన ఒరిస్సా లోని రూర్కెలా నిట్ లో ఎం.బి.ఏ లో సీటు సాధించిన విద్యార్థి కల్లూరు మండలం చెన్నూరుకి చెందిన



గడ్డం వెంకటేశ్వర్లుకు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా, అధ్యాపకులు గెస్టు అధ్యాపకులు,ఆఫీస్ సిబ్బంది, లక్షా నలభై మూడు వేల ఆర్థిక సహాయం చేశారు. పేద విద్యార్థికి కొద్ది సమయంలోనే మానవతా దృక్పథంతో సహాయం చేసేందుకు సామాజిక బాధ్యత వహించిన అధ్యాపకులు సూరంపల్లి రాంబాబుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఇతర కళాశాలల , వివిధ విభాగాల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్.ఆర్.ఐ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు బయ్యన బాబూరావు స్పందిస్తూ రానున్న సెమిస్టర్ కు తమ సంస్థ చేయూతను అందిస్తుందని తెలిపారు. అధ్యాపకుల మానవీయతకు, సామాజిక బాధ్యత కు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్, అధ్యాపకులు సూరంపల్లి రాంబాబు, డా.బి.శ్రీనివాస్, డా.కె.కిరణ్ కుమార్ సుజాత, దడిగలశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీలో పాల్గొన్న 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** అమావాస్య మహా అన్నప్రసాద వితరణ సేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నెల రోజులు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 9వ రోజు మజ్జిగ వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా



తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు , 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిలకమర్రి శ్రీనివాస్ బాబు, బండారు శ్రీనివాస్, పులిపాటి సంపత్, చందా వీరభద్రం, మర్రిపల్లి భాస్కర్, గుర్రం కవి, మేక రామ్మూర్తి, నిర్వాహకులు పంతంగి అశోక్ పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ నేతలు

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్‌ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురువెళ్ల ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సోమ నరసింహారావు (జి.వై. నరేష్) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బత్తిని నరసింహారావు (బి యన్), సహాయ కార్యదర్శి బాదే రమేష్ (రవి ), సెంట్రల్ ఈసి సభ్యులు మాటేటి కిరణ్ కుమార్, రాయపూడి రవి కుమార్, వంగవీటి హరీష్, సుకాసి శేషగిరి రావు, పోట్ల రామనాదం మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు



# పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**-ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు : కలెక్టర్ దివాకర టిఎస్**
**-సాదా బైనామా పెండెన్సీని మార్గదర్శకాల ప్రకారం పూర్తిగా క్లియర్ చేయాలి**
**-భూ భారతీ, మీ సేవా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**
**-ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలి**
**-పౌర సేవల దరఖాస్తుల్లో పెండెన్సీకి అవకాశం లేదు**
**-భూ భారతీ స్లాట్లలో ఆలస్యం సహించబోం**
**- సమయానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి**
**-మార్గదర్శకాల ప్రకారం అన్ని దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలి**
**-ప్రజావాణి వినతులను 15 రోజుల్లో పరిష్కరించాలి**
**- రెవెన్యూ శాఖపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, మే 06(మనం బ్యూరో):** రెవెన్యూ శాఖలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మీ సేవా, భూ భారతీ, సాదా బైనామా, ప్రభుత్వ భూములు, పెండింగ్ సర్వేలు, ఇసుక, ఎస్ఐఆర్ వంటి అంశాలపై సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సాదా బైనామా అంశంపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్,ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఎన్ని ఫీల్ ఎన్క్వైరీలు నిర్వహించారు, ఎన్ని అర్హులను గుర్తించారు, ఎన్ని దరఖాస్తులను ఆర్డీవోకు పంపించారో నివేదికలో స్పష్టంగా చూపించాలని ఆదేశించారు. జిల్లాలో సాదా బైనామాకి సంబంధించి తహసీల్దార్లు మార్గదర్శకాల ప్రకారం అన్ని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.సాదా బైనామా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 2014 జూన్ 2కు ముందు జరిగిన లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తుదారులు భూమి స్వాధీనంలో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా రెగ్యులరైజ్ చేయరాదని, సరైన ఆధారాలు లేకుండా భూమి యాజమాన్యం మారకూడదని హెచ్చరించారు. ఆమోదించిన దరఖాస్తులకు పంచనామా తప్పనిసరి కాగా, తిరస్కరణ లకు కారణాలు, ఎన్క్వైరీ నివేదిక సరిపోతుందని తెలిపారు. భూమి స్థితిగతులపై పొరుగు పట్టాదారుల అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.భూ భారతీ పెండింగ్ స్లాట్లపై సమీక్షిస్తూ, రిజిస్ట్రేషన్ జరగని ప్రతి స్లాట్కు కారణాలు నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేయని వారి స్లాట్లు రద్దు అవుతాయని ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భూ భారతీ క్లియరెన్స్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తూ, ప్రతి రోజు 3 మండలాల నుండి క్లియర్ చేసిన ఫైళ్లను జిల్లా స్థాయికి తుది ఆమోదం కోసం పంపించాలని తెలిపారు. జిల్లా స్థాయి ఆపరేటర్ మండల అధికారులతో సమన్వయం చేస్తూ, పంపిన ప్రతి ఫైల్కు భౌతిక ప్రతులు తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి చేరేలా చూడాలని సూచించారు.రెవెన్యూ సదస్సుల్లో పెండింగ్ దరఖాస్తులపై మాట్లాడుతూ, అసైన్మెంట్ భూములను మినహాయించి, మిగతా దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా దరఖాస్తులను తహసీల్దార్లు సమయానికి క్లియర్ చేయాలని, పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తుల్లో పెండెన్సీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. తదుపరి సమీక్ష నాటికి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్లో ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూముల వివరాలు, విస్తీర్ణం, అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలతపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భూములను 5, 10, 20 ఎకరాల విభాగాలుగా వర్గీకరించి, రహదారి సౌకర్యం ఉన్నవి, లేనివి అని స్పష్టంగా చూపించాలని సూచించారు. నేలకొండపల్లి మండలంలో ఇప్పటికే స్వయం సహాయక సంఘానికి పెట్రోల్ బంక్ కోసం భూమి కేటాయించిన నేపథ్యంలో, రైస్ మిల్ ఏర్పాటు కోసం మరో 5 ఎకరాల భూమి లభ్యతపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు.2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మార్గదర్శకాల ప్రకారం ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ తక్కువగా ఉన్న చోట్ల బూత్ స్థాయి అధికారుల పనితీరును నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే ఓటరు రెండు చోట్ల నమోదు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఒక్క చోట మాత్రమే నమోదు ఉండేలా చూడాలని మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.అభివృద్ధి పనులు, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఇసుక సమస్యలు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. 'మన ఇసుక వాహనం' విధానం ప్రకారం ఎవరైనా సాండ్ బజార్ ద్వారా ఇసుకకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులను పరిశీలించి టోకెన్ జారీ చేస్తారని, విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. సాండ్ బజార్లో లభించే ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉన్నందున ప్రజలు పొందాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని గ్రీవెన్స్ విభాగానికి పంపించి, అక్కడి నుంచి సంబంధిత అధికారులకు పంపాలని తెలిపారు. ప్రతి వినతిని ప్రజావాణి ఆన్లైన్లో తప్పనిసరిగా అప్లోడ్ చేయడంతో పాటు, తీసుకున్న చర్యల నివేదికను కూడా నమోదు చేయాలని సూచించారు. ఏ వినతీ 15 రోజులకు మించి పెండింగ్లో ఉండకూడదని, 15 రోజులు దాటిన వినతుల వివరాలను కలెక్టర్కు నివేదించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు తమకు వచ్చిన ప్రతి వినతిని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్లు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల సూపరింటెండెంట్లు, ఆర్ఐలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సింథటిక్ ట్రాక్ పనులను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం, మే 06(మనం బ్యూరో):** జిల్లాలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సింథటిక్ ట్రాక్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆదేశించారు.లకారం ట్యాంక్ బండ్ వద్ద జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ పరిశీలించారు. ఖానాపురం హవేలీ ఊర చెరువు నుంచి ధంసలాపురం వరకు నిర్మిస్తున్న ట్రంక్ మెయిన్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధంసలాపురం వద్ద ఎస్టీపీ (ఖీఖ్క) ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని సమీప చెరువులకు విడుదల చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ట్రంక్ మెయిన్కు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సింథటిక్ ట్రాక్ పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన చిన్నపాటి పనులను వచ్చే రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి ఉపయోగానికి సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ పనులు తనిఖీ సందర్భంగా పబ్లిక్ హెల్త్ డిఈ నవీన్ కుమార్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, క్రీడా కోచ్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి గ్రీన్ సిగ్నల్...

- ఫలించిన మంత్రి తుమ్మల కృషి‘
- నిర్మాణానికి టిటిడి బోర్డు ఆమోదం
- 20 ఎకరాల్లో తిరుమల తరహా నిర్మాణం
- ధంసలాపురంలో భూమి కేటాయింపు
- సమగ్ర ఆధ్యాత్మిక కేంద్రంగా ఖమ్మం అభివృద్ధి
- చిన్న తిరుమల’గా అవతరించనున్న ఖమ్మం
- పర్యాటక, ఉపాధి అవకాశాలకు ఊతం
- రహదారులు, మౌలిక వసతుల మెరుగుదల
- త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం
- ఏపి సీఎం చంద్రబాబు, టిటిడి బోర్డు ఛైర్మన్, తెలంగాణ‘సీఎం రేవంత్, క్యాబినెట్ కు ధన్యవాదాలు ః మంత్రి తుమ్మల



**ఖమ్మం, మే 6(మనం బ్యూరో)ః** ఖమ్మం నగర ఆధ్యాత్మిక చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచే పరిణామం చోటుచేసుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ బోర్డు అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఎన్నో ఏళ్లుగా భక్తులు ఎదురుచూస్తున్న కల సాకార దశలోకి అడుగుపెట్టింది. తెలంగాణ ప్రభుత్వం ధ్వంసలాపురం రెవిన్యూ పరిధిలో కేటాయించిన 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రతిష్టాత్మక ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. రాష్ట్ర క్యాబినెట్ ఇప్పటికే భూమి కేటాయింపుకు ఆమోదం తెలపగా, తాజాగా టీటీడీ బోర్డు కూడా అనుమతి ఇవ్వడంతో నిర్మాణానికి అన్ని మార్గాలు సుగమమయ్యాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి, రెండు రాష్ట్రాల ప్రభుత్వాల సమన్వయం ఈ ప్రతిష్టాత్మక యత్నానికి బలంగా నిలిచాయి. తిరుమల తరహా దర్శనం, సదుపాయాలు ఖమ్మంలోనే అందుబాటులోకి రానుండగా, జిల్లా ‘చిన్న తిరుమల’గా రూపుదిద్దుకునే దిశగా ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో చేపట్టనున్న శ్రీవారి ఆలయ నిర్మాణంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న భక్తుల కల సాకార కానుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి పట్టుదల దైవచింతనతో ఈ మహత్తర కార్యానికి కీలక అడుగులు పడ్డాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాసుని ఆలయ నిర్మాణం పనులు వేగంగా ప్రారంభం కానున్నాయి. రెండు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఖమ్మం జిల్లా ఖిల్లాలో శ్రీనివాసుని నామ స్మరణతో మారు మ్రోగనుంది. ఖమ్మం జిల్లాకు ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా నూతన శోభను తీసుకువచ్చే కీలక పరిణామం చోటు చేసుకుంది.

**ఫలించిన తుమ్మల కృషి....**

ఈ మహత్తర ప్రాజెక్టు సాధనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, తిరుమల దర్శనానికి వెళ్లలేని వారికి స్థానికంగానే టీటీడీ తరహాలోనే టీటీడి వారి ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం ఏర్పాటు చేయాలని ఆయన నిరంతరం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించడం ద్వారా ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది.

**20 ఎకరాల్లో తిరుమల వాతావరణం...**

ద్వంసలాపురం పరిధిలో కేటాయించిన 20 ఎకరాల భూమిలో ఆలయంతో పాటు యాత్రికుల కోసం వసతి గృహాలు, కళ్యాణ మండపం, పార్కింగ్ సౌకర్యాలు, ధార్మిక కార్యకలాపాల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఖమ్మంలో తిరుమల తరహా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడనుంది.

**రెండు రాష్ట్రాల సమన్వయం...**

టీటీడీ బోర్డు ఆమోదం నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇదే సమయంలో భూమి కేటాయింపుకు ముందడుగు వేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ మహత్తర కార్యం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

**అభివృద్ధికి నాంది...**

టీటీడీ నిధులతో ఆలయ నిర్మాణం త్వరలోనే ప్రారంభం కానుండగా, ఈ ప్రాజెక్టు ఖమ్మం జిల్లాను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా కీలకంగా మారనుంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యాపార రంగానికి కూడా ఊతం లభించనుంది.

**టీటీడీ ఆమోదంతో ఖమ్మంలో ఆలయం...**

ఖమ్మం జిల్లాలో భక్తుల దీర్ఘకాలిక ఆశ నెరవేరనుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ బోర్డు ఆమోదం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో భూమి కేటాయింపుతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుంది. దీంతో ఖమ్మం, పరిసర ప్రాంతాల భక్తులకు తిరుమల తరహా దర్శన సౌకర్యాలు, ఆధ్యాత్మిక అనుభూతి స్థానికంగానే అందుబాటులోకి రానుంది.

**సమగ్ర ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకోనున్న ఆలయం**

టీటీడీ ప్రణాళికల ప్రకారం ఆలయాన్ని సమగ్ర ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. నిత్య కైంకర్యాలు, అర్చనలు తిరుమల విధానంలో నిర్వహించడంతో పాటు సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదం, వసతి గృహాలు, విశాలమైన పార్కింగ్ స్థలాలు, ఆధునిక క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదం పంపిణీ వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. శుచిత్వం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

**ప్రాంత అభివృద్ధికి ఊతం...**

ఈ ఆలయ నిర్మాణం ద్వారా ఖమ్మం ప్రాంతానికి ఆర్థిక, సామాజికంగా ఊతం లభించనుంది. పర్యాటక రద్దీ పెరగడంతో స్థానిక వ్యాపారాలు చురుకుదనాన్ని సంతరించుకోనున్నాయి. ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపడే అవకాశముంది.

**తిరుమల శైలిలో నిర్మాణం....**

టీటీడీ నిర్మించే ఆలయాలు సాధారణంగా తిరుమల శైలిని ప్రతిబింబిస్తాయి. ఖమ్మంలో కూడా అదే నమూనాలో ఆలయ నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది. దీంతో భక్తులకు తిరుమల వాతావరణాన్ని ఇక్కడే అనుభవించే అవకాశం కలగనుంది.

మొత్తంగా, టీటీడీ ఆమోదంతో ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం భక్తి, అభివృద్ధి, ఆర్థిక పురోగతికి కొత్త దారులు తీసుకురానుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ఖమ్మం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరింది...**

త్వరలోనే టీటీడీ అధికారులతో సమావేశమై నిర్మాణ పనులను వేగవంతం చేస్తాం అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.టీటీడీ బోర్డు ఆమోదంతో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి మార్గం సుగమమవడంతో, ఖమ్మం నగరం త్వరలోనే ఆధ్యాత్మిక కేంద్రమైన చిన్న తిరుమలగా రూపుదిద్దుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## మైనార్టీలకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ

### –మే 31 తేదీ లోపు దరఖాస్తుల స్వీకరణ

### –రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు యాకూబ్ పాషా



**ఖమ్మం, మే 6(మనం న్యూస్)ః** యూపీఎస్సీ 2027లో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థుల కోసం తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ వారు అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు కలిగి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి 3 ఏండ్ల డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ యొక్కశిక్షణ పొందటానికి అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్దులు తమ వివరాలను https://cet.cgg.gov.in/tmreis వెబ్సైట్ ద్వారా ఈ నెల 31 వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్దులకు జూన్ 14 న రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాలలోని సమీప మైనారిటీ గరుకులాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబడతుందని, ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో మెరిట్ సాధించిన అభ్యర్దులకు మెరిట్ ప్రాతిపదికన 100 మందిని ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించటం జరుగుతుందని ఇట్టి అవకాశాన్ని రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్శి మతాలకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కొరకు 8520860785 నంబర్ నందు సంప్రదించాలని సూచించారు.

## జిల్లా కోర్టును సందర్శించిన ఎంపీ రఘురాం రెడ్డి

### ప్రధాన న్యాయమూర్తిని మర్యాదగా కలిసి సత్కారం

### వేసవికాలం దృష్ట్యా కోర్టు ప్రాంగణంలో కక్షిదారులకు దద్దోజనం, పెరుగన్నం పంపిణీకి శ్రీకారం



**ఖమ్మం, మే 6(మనం న్యూస్)ః** జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు బుధవారం సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని జిల్లా జడ్జి సత్కరించారు. కోర్టుకు వచ్చే కక్షిదారుల కోసం పెరుగన్నం పంపిణీ వేసవికాలం తీవ్రమైన ఎండల దృష్ట్యా... జిల్లా ప్రధాన కోర్టుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కక్షిదారుల కోసం రామసహాయం కల్పనా రెడ్డి జ్ఞాపకార్థం ఏప్రిల్ 28న ప్రారంభమైన దద్దోజనం, పెరుగన్నం పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్వయంగా పలువురు కక్షిదారులకు వడ్డించారు. జూన్ ఒకటో తేదీ వరకు నిరంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, కక్షిదారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ రూమ్ కు.. సొసైటీ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు సొసైటీ రూమ్ ను ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి సందర్శించారుఈ కార్యక్రమంలో..: సీనియర్ న్యాయవాదులు స్వామి రమేష్ కుమార్, నిరంజన్ రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, సెక్రటరీ కొప్పుల రవి, దండ సుధాకర్, జిపి రవీందర్, పి పి శరత్ కుమార్ రెడ్డి, ఏజిపి రత్నాకర్, తాళ్లూరి దిలీప్, మహిళా న్యాయవాదులు ఊటుకూరి విజయలక్ష్మి, రాధమ్మ, దేవరకొండ కళ్యాణి, తన్నీరు లలిత, ప్రీతి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## విషపూరిత నాగుపామును పట్టుకున్న ప్రాణధార

### – ఊపిరి పీల్చుకున్న స్థానికులు



**లక్ష్మీదేవిపల్లి మే 06 (మనంన్యూస్):** మండలంలోని కారుకొండ రామవరం పంచాయతీలోని మారుమూల గ్రామం ఓ ఇంట్లో తాచుపాము వచ్చిందని అర్ధ రాత్రి ఫోన్ రావడంతో ప్రాణదార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్ బాబు, సభ్యులు శ్రీకాంత్ (చోటు), బబ్లూ వెంటనే బయలుదేరి వెళ్లారు. అప్పటికే ఇంట్లో ఇరుకైన రెండు గోడల మధ్యలో ఉన్నట్టు తెలిపారు. ఎన్ని రకాలుగా నాలుగు గంటలు ప్రయత్నించినా ఆ పాము బయటకు రాలేదు. కనిపించనూ లేదు. ఎలాగైనా పట్టాలని సంకల్పంతో చివరికి గోడను పగలగొట్టి బుసలు కొడుతున్న (నాజా నాజ) స్పెక్టికల్ కోబ్రా స్నేక్ ను సురక్షితంగా బంధించడంతో ఆ కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వారికి అవగాహన కల్పించి రాత్రి వేళ భద్రపరిచి అటవీ శాఖ అధికారులకు సమాచారం మేరకు బుధవారం అటవీ ప్రాంతంలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాణధార ట్రస్ట్ ఫౌండర్ మెంబర్, (భద్రాచలం మైనార్టీ వెల్ఫేర్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపల్) రాజసమయ్య పాల్గొన్నారు.



## ఎన్‌కే నగర్‌లో క్రికెట్ కిట్ల పంపిణీ చేసిన సర్పంచ్ శ్రీకాంత్

**చుంచుపల్లి,మే 6(మనం న్యూస్):** ఎన్‌కే నగర్ (బాదావత్ తండా)లో యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించేందుకు ఒక అద్భుతమైన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్ యువకులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ మరియు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు కూడా ఇవి ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా సురేష్, రఘు, నికోలస్, రాము మరియు బాదావత్ తండా యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వారు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. యువతకు అవసరమైన మౌలిక వసతులు అందిస్తూ, గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని యూత్ కమిటీ సభ్యులు సంకల్పించారు. ఈ కార్యక్రమం స్థానికంగా మంచి స్పందన పొందింది.

## నాణ్యమైన ఎరువుల్ని, విత్తనాల్ని...

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు ఎరువుల డీలర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్ విద్యార్థికి ఆల్ ఇండియా 85వ ర్యాంక్



**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** దేశ వ్యాప్తంగా నిర్వహించిన జెఈఈ మెయిన్స్–2026 పేపర్–2, బి.ఆర్కిటెక్చర్ ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి తమ ఆధిక్యాన్ని చాటుకున్నారు. రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీలలో సాధించిన ఆల్ ఇండియా ర్యాంక్స్ పి. జోస్మిత 85 వర్యాంక్, బి. అవినాష్ 230వ ర్యాంక్, టి.వినయ్ 622వ ర్యాంక్, డి. కావ్య 936వ ర్యాంక్, జి. కార్తీక్ 1149 వ ర్యాంక్, డి.సంతోష్ 1689 వ ర్యాంక్, బి. మేఘనాద్ 2253వ ర్యాంక్, ఆర్.రేవంత్ సాయి 6533, ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఆర్.వి. నాగేంద్ర కుమార్, కొండా శ్రీధర్ రావు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయం సాధించడానికి పటిష్ఠమైన ప్రణాళిక అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం బోధనానుభవం కలిగిన మెనేజ్ మెంట్ ఈ విజయానికి కారణమని తెలిపారు. ఇంటర్ తో పాటే ఐఐటి, నీట్, ఎంసెట్ వంటి అన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణనివ్వడం ద్వారా ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ గ్రామీణ ప్రాంత విద్యార్థులతో సైతం అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. స్కూల్ స్థాయిలో ఐఐటి ఫౌండేషన్ కల్గిన విద్యార్థులతో పాటే, ఇతర విద్యార్థులకు కూడా మంచి పర్సంటైల్ సాధించామని వారు తెలిపారు. ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు.

# జెఈఈ బి–ఆర్క్ 2026 మొదటి బ్యాచ్‌తోనే అద్భుత ఫలితాలు సాధించిన స్టెమ్‌స్పార్క్ విద్యార్థులు




**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు బుధవారం ప్రకటించిన జెఈఈ బి–ఆర్క్ 2026ఫలితాలలో 468వ ర్యాంక్ సాధించి మొదటి బ్యాచ్‌తోనే సంచలన విజయాలను సాధించి ప్రభంజనం సృష్టించటం జరిగింది.
జెఈఈ బి–ఆర్క్ అండ్ ప్లానింగ్ వంటి జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షలలో 75 మంది పరిమిత విద్యార్దులతో మొదటి ప్రయత్నంలోనే మొదటి బ్యాచ్‌తో ప్రతిష్ఠాత్మక బి–ఆర్క్ ఫలితాలలో అఖండ విజయాలను సాధించింది. స్టెమ్‌స్పార్క్ విద్యార్థులు జాతీయ స్థాయి వివిధ కేటగిరిలలో యం. అశ్రితమయి 468, బి.వి.మోహన తారక్ 884, బి.అవినాష్ 993, బి.విహారిక 1910, యం.వర్షిత్ 1966, జె.అంజలీ 1983, సి.హెచ్.గాయత్రి 2178, బి.ప్రవీణ్2234, పి.యన్.అనీరుద్ వర్మ 3267, కె.శ్రీకర్ 3541, యు.సత్యతేజస్విని 4035, యం.తరుణ్ సాయి 4842, వి.జ్ఞానశ్రీ 5112, జి.హర్ష తేజస్విని 5749 ర్యాంకులను సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ అభినందన కార్యక్రమంలో స్టెమ్‌స్పార్క్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ అతి తక్కువ విద్యార్థులతో మొదటి బ్యాచ్‌లోనే జెఈఈ మెయిన్‌లో 393వ ర్యాంక్‌తో పాటు జెఈఈ బి–ఆర్క్, ప్లానింగ్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో అత్యద్భుత ఫలితాలను సాధించడం జరిగింది. భవిష్యత్తులో స్టెమ్‌స్పార్క్ విద్యార్థులకు నీట్, ఐఐటి సీట్ల సాధనే లక్ష్యంగా క్రమబద్ధమైన ప్రణాళికతో బోధన చేస్తామని తెలిపారు. జెఈఈ బి–ఆర్క్ అండ్ ప్లానింగ్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విద్యార్థిని, విద్యార్థులను అభినందిచారు.

## బి–ఆర్కి ప్లానింగ్ ఫలితాల్లో హార్వెస్ట్‌కి అగ్రస్థాయి ర్యాంకులు

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో 'ఆర్కిటెక్చర్' ప్లానింగ్' విద్యనభ్యసించుటకు ఎన్. టి.ఏ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మెయిన్స్ బి–ఆర్క్ మరియు ప్లానింగ్ పరి ఫలితాల్లో తమ కళాశాల విద్యాకులు ఆలిండియా టాప్ ర్యాంకులు సాధించినట్లు 'హార్వెస్ట్' విద్యాసంస్థల యాజమాన్యం ' బుధవారం' ఒక ప్రకటనలో తెలిపింది. గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన మెయిన్స్ రెండోదఫా 9–98 మరియు ఫ్లోరింగ్ పరిక్షా పలితాలు బుధవారం ఎఫ్.టి.ఏ. వారు ప్రకటించారు. ప్రకటించిన ఫలితాల్లో తమ విద్యార్థి చామర్తి. క్రిష్ణ మాధుర్ ఆల్ ఇడియా ఓపెన్ కేటగిరిలో 77వ ర్యాంక్ సాధించి కళాశాలను అగ్రస్థానంలో నిలిపారన్నారు. వివిధ కేటగిరిలలో సాయిచరణ్ ఆలిండియా 4వ కేటగిరి ర్యాంకు, ఏ.రుత్విక్ పదో కేటగిరి ర్యాంక్, పి.జయదేవ్ 31వ కేటగిరి ర్యాంక్, ఎం.జ్యోత్స 137వ ర్యాంక్, బి.విజయ్ 153 క్యాటగిరి ర్యాంకు, బి.భువనేష్ 173 క్యాటగిరీ ర్యాంకులు సాధించారు. ప్లానింగ్ విభాగంలో సాయి చరణ్ ఆల్ ఇండియా 4వ కేటగిరీ ర్యాంక్, పి.జయదేవ్ 394 ర్యాంక్ సాధించారని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను 'బుధవారం' 'హార్వెస్ట్ గూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవి మారుతి, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని విజయాలను సాధించాలని అభిలాషించారు.





## జేఈఈ మెయిన్స్‌లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

**ఖమ్మం, మే 6(మనం న్యూస్):** జేఈఈ మెయిన్స్ 2026 పేపర్–2, బి.ఆర్కిటెక్చర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో ఏ.శిశిర్ సాయి–146,ఏ.మోక్షిత సాయి–657, వి.ఎస్.ఎస్ లక్ష్మి–982, వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. రిజర్వేషన్ కేటగిరి విభాగంలో కె స్టాన్లీ చరణ్–18, టి.సంతోష్ కుమార్–38, ఏ.మోక్షిత సాయి–42, వి.ఎస్.ఎస్.లక్ష్మి–63,ఎం.సాయి సాత్విక – 849, ఎం. జెస్వంత్సాయి–1152,బి. యోగ్యశ్రీ–1180,టి. భువనసాయి–1217, ఆర్.మేధిని–1349,డి. శ్రావణి –1724, కె.కార్తికేయ–2052,బి. సింధు –2077, బి.సంతోష్ –2279, ఏ రాకేష్ –2451,ఎం. వెంకటేశ్వర్లు –2490, ఎం.శ్రీహితఉజ్వల–2574,....ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు .ఈ విజయోత్సవ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ ,ఏవో నిరంజన్ కుమార్, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.